నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
1
గురువారం | జనవరి 23, 2025 | www.navatelangana.com

దాడి చేసిన వారిని శిక్షించాలని ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి ఫిర్యాదు


నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



మున్సిపల్ కార్యాలయంలో.. మంగళవారం తనపై... దాడిచేసిన కాంగ్రెస్, నాయకులు,గుండాల పై.వారికి సహకరించిన. పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని... కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ.. బుధవారం నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి నల్లగొండలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఆయన వెంట రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మెన్లు రామచంద్రు నాయక్, పల్లె రవికుమార్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, రాజీవ్ సాగర్, మాజీ మున్సిపల్ చైర్మెన్ మందడి సైదిరెడ్డి తదితరులు ఉన్నారు.

అర్హులకు అందని సంక్షేమ పథకాలు

- బీఆర్ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగం గౌడ్



నవతెలంగాణ-మర్రిగూడ

ప్రభుత్వం ప్రవేశపెడుతున్నటువంటి సంక్షేమ పథకాలు అర్హులకు అందటం లేదని,అధికారులు రూపొందించిన లబ్ధిదారుల జాబితాలో 90 శాతం అర్హుల పేర్లే లేవని బిఆర్ఎస్ జిల్లా నాయకులు చెరుకు లింగం గౌడ్ అన్నారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడారు.గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితా సరిగ్గా లేక అధికారుల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని,గ్రామ సభల్లో అంత గందరగోళ వాతావరణం నెలకొంటుందని అన్నారు.ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు విషయంలో జాప్యం చేస్తుందని,పథకాలలో కోతలు విధించడానికే పలుమార్లు సర్వేలు,దరఖాస్తులు స్వీకరిస్తుందని ఆయన పేర్కొన్నారు. అధికారులు మరల మండల వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి లబ్ధిదారుల జాబితాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అర్హుల జాబితాను రూపొందిస్తాం

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- పథకాలకు ప్రభుత్వం శ్రీకారం
- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



నవతెలంగాణ-నార్కట్‌పల్లి

ప్రభుత్వ పథకాల కింద ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను మాత్రమే గ్రామసభలలో చదివి వినిపించడం జరుగుతున్నదని,వీటన్నంటిని క్రోడీకరించి తర్వాత అర్హుల జాబితాను రూపొందిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. ప్రజాపాలన గ్రామసభలలో భాగంగా బుధవారం ఆమె నార్కట్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభకు నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రేషన్‌కార్డులు, ఇందిరమ్మఇండ్లు, రైతుభరోసా, ఆత్మీయభరోసా తదితర పథకాల కింద అర్హుల జాబితాలు చదువుతున్నారన్నారు. ఇవే తుది జాబితాలంటూ కొందరు అపోహలు సృష్టిస్తూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఇది నిజం కాదని, ప్రజలు ఇలాంటివి నమ్మొద్దని కోరారు. ప్రజా పాలన, రాష్ట్రస్థాయి ప్రజావాణి, జిల్లా ప్రజావాణి. ,మీసేవ తదితర సందర్భాలలో ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు, రైతుభరోసా తదితర పథకాలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 24 వరకు నిర్వహించే గ్రామసభలలో కేవలం ఆయా పథకాల డేటాను మాత్రమే సేకరిస్తున్నామని తెలిపారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ ప్రజాపాలనలో భాగంగా గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులకు అందించే పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమేష్,చిట్యాల మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ ఐతరాజు యాదయ్య ఏఓ గౌతమ్,జెరిపోతుల భరత్, ఎండి. సర్వర్ అలి,శంకర్, సమాద్,సత్యనారాయణ, పాల్గొన్నారు.

చిట్యాల : అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని కలెక్టర్ ఇలా ప్రతిపాఠి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా బుధవారం చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామంతో పాటు మున్సిపల్ కేంద్రంలోని ఐదు, ఆరవ వార్డులలో జరిగిన గ్రామసభలలో వారు మాట్లాడుతూ అర్హత కలిగిన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు రైతు భరోసా పథకాలను అందజేస్తామన్నారు. చిట్యాల మాజీ సర్పంచ్ , సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు జట్ట నగేష్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు, ఇండ్ల స్థలాల విషయంలో రాజకీయాలకతీతంగా అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి నిజమైన పేదలకు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ నర్ర వినోద మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు బెల్లి సత్తయ్య, జడల పూలమ్మ చిన్న మల్లయ్య, సీపీఐ(ఎం) నాయకులు అవిశెట్టి శంకరయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు జడల చిన్న మల్లయ్య యాదవ్, ఏళ్ల చంద్రశేఖర్ యాదవ్, జంపాల వెంకన్న బిఆర్ఎస్ నాయకులు గుండబోయిన సైదులు తదితరులు పాల్గొన్నారు.

జాబితాలో పేర్లు లేకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోండి

యాద్గార్‌పల్లి గ్రామ సభలో సబ్ కలెక్టర్

మిర్యాలగూడ : జాబితాలో పేర్లు లేకుంటే మళ్ళీ దరఖాస్తు చేసుకోవాలని సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ కోరారు. మండలంలోని యాద్గార్ పల్లి గ్రామంలో ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం జనవరి 26 నుండి 4 కొత్త పథకాలు అమలు చేస్తుందని వాటిలో లబ్ధిదారులు ఎంపిక చేసినందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు వరకు దర్జా చేసుకున్న పేర్లను గ్రామ సభలో చదివి వినిపించారు జాబితాలో పేర్లు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండల ఆఫీస్ లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత కలిగిన వారందరినీ పథకాలకు అర్హులుగా గుర్తిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దేవ్ సింగ్ తాసిల్దార్ హరిబాబు ఎంపీడీవో శేషగిరి శర్మ కాంగ్రెస్ నాయకులు గాయం ఉపేందర్రెడ్డి, మహెబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.



నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ నాగార్జునసాగర్ పరిధిలో బుధవారం నిర్వహించిన వార్డు సభలలో భాగంగా రెండవ రోజు కూడా కొనసాగాయి. మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులలో బుధవారం రెండో వార్డు ఆరో వార్డు 11వ వార్డులలో సభలను నిర్వహించినట్లుగా మునిసిపల్ కమిషనర్ శ్రీను తెలిపారు . బుధవారం నిర్వహించిన వార్డు సభలలో రేషన్ కార్డుల కోసం 178 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 33 దరఖాస్తులు తీసుకున్నట్లుగా తెలిపారు.

రసాభాసగా వార్డు, గ్రామ సభలు

నవతెలంగాణ-చండూరు



చండూరు మున్సిపాలిటీ 4వ, 5వ, 6వ వార్డులలో అధికారులు బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన వార్డు సభలు రసాభాసగా మారాయి. ఈ సందర్భంగా గతంలో సంక్షేమ పథకాలకు అప్లై చేసుకున్న లబ్ధిదారుల లిస్ట్ ను అధికారులు ప్రజలకు చదివి వినిపించారు. తమ పేర్లు రాలేదని అనర్హుల పేర్లు వచ్చాయని, భూస్వాములకే, ధనవంతులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వారి పేర్లు వస్తున్నాయని అధికారులను ప్రజలు ప్రశ్నించడంతో గందరగోళం నెలకొన్నది. దీంతో అధికారులు అర్హులైన వారిని గుర్తించి అందరికీ పథకాలు అందేలా చూస్తామని చెప్పడంతో గొడవ సద్దుమనిగింది.అర్హులు ఎవరైనా ఉంటే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు ,ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తేరేటుపల్లి గ్రామ సభలో అధికారులను నిలదీసిన ప్రజలు



గట్టుప్పల మండలంలోని తేరేటిపల్లి గ్రామంలో గట్టుప్పల్ తహసీల్దార్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన గ్రామసభలో ఇందిరమ్మ ఇండ్లు,ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులలో జరిగిన అవకతవకలపై గ్రామ ప్రజలు అధికారులను ప్రశ్నిస్తూ నిలదీశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ గొరిగె సత్తయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాదిపాలనలో ఎలాంటి అభివృద్ధి చేయకపోగా ప్రజాపాలన 6 గ్యారంటీల పేరుతో ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తుందని తెలిపారు.ఇందిరమ్మ ఇండ్లు అర్హులందరికీ ఇవ్వాలని, భూమిలేని వారికి జాబ్‌కార్డుతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రూ.12వేలివ్వాలన్నారు.గ్రామంలోని అర్హులందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు, పాల్గొన్నారు.

ఆర్టిజన్స్‌ను తక్షణమే కన్వర్షన్ చేయాలి

- ఆర్టిజన్స్ జెఏసీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సలీం పాషా,
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నవతెలంగాణ-క్లాక్‌టవర్



విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్స్‌ను తక్షణమే కన్వర్షన్ చేయాలని ఆర్టిజన్స్ రాష్ట్ర జేఏసీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సలీం పాష, నల్లగొండ జిల్లా జేఏసీ చైర్మన్ ఆనంద్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని సర్కిల్ విద్యుత్ కార్యాలయం వద్ద టీవీఏసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆర్టిజన్స్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో గత 20ఏండ్లుగా ఎవరికి ఆటంకం కలిగించకుండా విధులు నిర్వహిస్తున్నామని అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ఆర్టిజన్స్‌ను గుర్తించిందన్నారు. కానీ బ్రిటిష్ కాలం నాటి స్టాండింగ్ ఆర్డర్స్ రూల్స్‌ను అమలు చేస్తూ రెగ్యులర్ ఉద్యోగులకు, ఆర్టిజన్స్‌కు వ్యత్యాసం కల్పించేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టిజన్‌లను జూనియర్ లైన్ మెన్‌లుగా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. చాలీచాలని వేతనాలతో జీవనాన్ని గడుపుతున్నామని కాబట్టి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన ప్రభుత్వం ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు కల్పించేలా కన్వర్షన్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచమల్ల యాదయ్య దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్స్ జిల్లా కన్వీనర్ పెరిక శేఖర్, కో చైర్మెన్‌శ్రీపతి రమేష్, జిల్లా జాయింట్ సెక్రటరీ లు జిట్టబోయినలింగస్వామి,దాసరి యాదయ్య ,రవిందర్ రెడ్డి, జిల్లా ఫైనాన్స్ సెక్రటరీ హతీరాం నాయక్ ,గుండ్ల లింగారెడ్డి పోతెపాక విజయ్,చంద్రశేఖర్ రెడ్డి(ట్రాన్స్కో)సహదేవ్ (ట్రాన్స్కో),విశ్వం,యాదయ్య (ట్రాన్స్కో),కాశీరాములు బొప్పాని యాదయ్యతదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- 25న సంగారెడ్డి లో బహిరంగ సభ
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

నవతెలంగాణ-క్లాక్‌టవర్





సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని ,25న గొప్ప బహిరంగ సభ జరుగుతుందని అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆ పార్టీజిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డిలి పిలుపునిచ్చారు. బుధవారం ఆర్టీసీ కాలనీలో రాష్ట్ర మహాసభ జయప్రదం కోసం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ సిపిఎం ప్రజా సమస్యల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రాజెక్టుల సమస్యలు భూమిలేని నిరుపేదల సమస్యలు కార్మిక హక్కులు కార్మిక చట్టాలు రక్షణ కోసంఉద్యమాలు కొనసాగిస్తుందన్నారు, సీపీఐ(ఎం) జాతీయ గుర్తింపు కలిగిన పార్టీ నిరంతరం పేదలు కార్మికులు ఉద్యోగులు కష్టజీవులు హక్కుల కోసం పోరాడుతున్న పార్టీ ప్రజాస్వామ్యం లౌకిక విధానం సామాజిక న్యాయం కోసం అంకిత భావంతో ఉద్యమిస్తున్న పార్టీ అని అన్నారు. ఈ మహాసభల్లో రాష్ట్రంలోని ఆర్థిక సామాజిక అంశాలు కార్మిక కర్షక పేదలు మహిళలు ఉద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించే భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పది సంవత్సరాలుగా అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలు పారిశ్రామికరంగాన్ని వ్యవసాయరంగాన్ని దివాలా తీయించాయన్నారు. విద్య వైద్యం సామాన్యులకు అందని ద్రాక్షలా మారిందన్నారు. ఈ రాష్ట్ర మహాసభల్లో అనేక ప్రజా సమస్యలపై చర్చించి దిశా నిర్దేశం చేయడం జరుగుతుందని ఈ సభలు జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్టీసీ కాలనీ ఆ పార్టీ శాఖ కార్యదర్శి కారంపూడి రాము అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య ,జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, న్యాయవాదుల సంఘం జిల్లా కార్యదర్శి అనంతుల శంకరయ్య ,పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ ,అద్దంకి నరసింహ, కోట్ల అశోక్ రెడ్డి ,గాదే నరసింహ, గుండాల నరేష్, సలివొజు సైదాచారి, అవుట రవీందర్, బాణాల పరిపూర్ణాచారి, పాలాది కార్తీక్ ,కునుకుంట్ల ఉమారాణి, శాఖ సహాయ కార్యదర్శి మాటూరి సునీత, శాఖ సభ్యులు ఒట్టికోటి కాశయ్య ,చినపాక మంజుల, జయశ్రీ, బాలు, మౌనిక ,సంతు, అంతమ్మ ,కవిత ,తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండాదండా ఎర్రజెండా

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల

శాలిగౌరారం :పేదప్రజల సమస్యల పరిష్కారానికి సీపీఐ(ఎం) అండాదండా అని, ప్రత్యామ్నాయం అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల అన్నారు. సంగారెడ్డిలో నిర్వహించనున్న సీపీఐ(ఎం) నాల్గో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం మండలకేంద్రంలో కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు.అనేక మంది పేదలకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సాక్షిగా అనేక మందికి వెట్టి చాకిరి విముక్తి బానిస చేరల నుండి విడిపించి భూమి లేని వారికి 10 లక్షల ఎకరాలను పంచి, పేదల బతుకులో వెలుగులు నింపింది సీపీఐ(ఎం) మాత్రమేనన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలన్నారు.ఆర్థికభారాలను పేదలపై మోపకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, మండలనాయకులు మక్కా బుచ్చిరాములు, కారింగుల వెంకన్న ,ఎల్లాంల వెంకటయ్య, కల్లూరి లింగయ్య, సిర్పంగి లింగం, దండ సోమిరెడ్డి, ఎర్ర రమేష్, దాసరి దేవచ్చితం, తెలుకుంట్లజగన్,గుండాల సత్యనారాయణ, సైదులశ్రీను, డెంకాల లింగయ్య, చలగాని కుమార్ పాల్గొన్నారు.



బీఆర్ఎస్ నుంచి యల్లపురెడ్డి సైదిరెడ్డి బహిష్కరణ

నవతెలంగాణ-నకిరేకల్

బీఆర్ఎస్ నకిరేకల్ పట్టణ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఎల్లపు రెడ్డి సైదిరెడ్డిని అధ్యక్ష పదవి, పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్ రావు తెలిపారు. బుధవారం నకిరేకల్ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత కొంతకాలంగా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు సైదిరెడ్డి పాల్పడుతున్నాడని పేర్కొన్నారు. తన వ్యవహార శైలిని మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరించినా కూడా మార్పు రాకపోవడంతో బీఆర్ఎస్ అధిష్టానం, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆదేశానుసారం పార్టీ నుండి బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. పార్టీ సభ్యులు ఎవరైనా పార్టీలో ఉంటూ పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడితే తగిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ రాచకొండ శ్రీనివాస్ గౌడ్, నాయకులు పల్లె విజయ్, భీమనబోయిన లింగరాజు, గుర్రం గణేష్, సామ శ్రీనివాసరెడ్డి, బెజవాడ రామకృష్ణ, కొండ వినయ్, చెరుకు వెంకటాద్రి పాల్గొన్నారు.

సంత్ సేవలాల్ జయంతికి సెలవు ప్రకటించాలి

బంజారా ఉద్యోగుల సంఘం తెలంగాణా రాష్ట్ర కన్వీనర్ దశరథ్ నాయక్

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఫిబ్రవరి 15న జరిపే సంత్ సేవాలాల్ జయంత్ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని, జయంతి రోజు బంజారా ఉద్యోగుల పాల్గొనేందుకు గాను ప్రభుత్వం సెలవు ప్రకటించాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోథ్ దశరథ్ నాయక్ కోరారు. ఆ సంఘం తెలంగాణా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో తయారు చేసిన డైరీ, క్యాలెండర్ ను హైద్రాబాద్ లోని సెక్రెటేరియట్‌లో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శరత్ నాయక్, నల్గొండ జిల్లా అడిషనల్ సూపరెండెంట్ ఆఫ్ పోలీస్ రాములు నాయక్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సేవలాల్ జయంతి వేడుకల నిర్వహణ, నిధుల విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. శరత్ నాయక్ మాట్లాడుతూ నిధుల విడుదల, ఆప్షనల్ హాలిడే విషయమై ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిపారు..కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు తుకారాం నాయక్,ఆనంద్ నాయక్, బంజారా సేవ సంఘం నాయకులు కేతవత్ సీతారం నాయక్,మాత్రు నాయక్,రవి నాయక్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జాబితాలో పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోండి

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రభుత్వ పథకాలలో అర్హుల జాబితాలో పేర్లు రాని వారు తిరిగి దరఖాస్తు చేసుకున్నట్లయితే అధికారులు పరిశీలించి పథకాలను వర్తింప చేస్తారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధికారులు నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను అర్హులైన పేదలందరికి వర్తింప చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రవినాయక్, తిరుపతిరెడ్డి, కృష్ణమూర్తి, భీమేష్, నాగునాయక్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



పలు కుటుంబాలను పరామర్శించిన చెరుపల్లి సీతారాములు

నవతెలంగాణ-చిట్యాల

మండలంలోని నేరడ గ్రామంలో ఇటీవల చనిపోయిన సీపీఐ(ఎం) నాయకులు ,సానుభూతి కుటుంబాల సభ్యులను ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు బుధవారం పరామర్శించారు. నేరడ గ్రామంలో మందుగుల యాదయ్య,పెందోట అమ్మాయమ్మల ఇంటికి వెళ్ళి ఆయా కుటుంబాలసభ్యులను ఓదార్చి తమ ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.మృతుల చిత్రపటాలకు పూలమాలలేసి జోహార్లర్పించారు.ఈ కార్యక్రమంలో ఆపార్టీ జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టిశంకరయ్య, మండల నాయకులు కందగట్ల గణేష్, కల్లూరి క్షత్రయ్య,పోలోజు ఈశ్వరాచారి,చెన్నోజుపాండు తదితరులు పాల్గొన్నారు.

నేడు మిర్యాలగూడకు తమ్మినేని రాక

- గాద శ్రీనివాస్ రెడ్డి విగ్రహ ఆవిష్కరణ

నవతెలంగాణ-మిర్యాలగూడ

మిర్యాలగూడ పట్టణంలోని నల్గొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కామ్రేడ్ గాద శ్రీనివాస్ రెడ్డి విగ్రహావిష్కరణకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరుకానున్నట్లు ఆ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈదులగూడెం లోని సుందరయ్య విగ్రహం నుండి నల్గొండ రోడ్డులోని గాదే శ్రీనివాస్ రెడ్డి స్థూపం వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విగ్రహావిష్కరణ అనంతరం సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు తమ్మినేని వీరభద్రంతోపాటు కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు , రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా సంఘాల బాధ్యులు పార్టీ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

బీఆర్ఎస్ హాయంలోనే రాష్ట్రాభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు
- బీఆర్ఎస్‌లో చేరిన ఎన్ఆర్ఐ దంపతులు

నవతెలంగాణ-మిర్యాలగూడ



గత పదేండ్ల బిఆర్ఎస్ ప్రభుత్వ హాయంలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. బుధవారం దామరచర్ల మండలం రాళ్లవాగుతండాకు చెందిన ఎన్ఆర్ఐ (ఆస్ట్రేలియా) ధీరావత్ రాయమల్, స్రవంతి దంపతులతోపాటు అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ధీరావత్ భాలాజీనాయక్, ధీరావత్ అశోక్‌నాయక్, టీడీపీ నాయకులు ధీరావత్ అశోక్, ధీరావత్ చందర్‌భాఉను, ధీరావత్ రాజు, సపావత్ రాందాస్, లచ్చునాయక్, మాన్‌తండాకు చెందిన మాలోతు హరి, లావూరి వెంకట్రామ్‌లతోపాటు పలువురు పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్నింటా ముందుందని, కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రుణమాఫీనికి 80శాతం మంది రైతులకు చేయలేదని, అధికారంలోకి వచ్చి 14 నెలలు దాటినా ఇంతవరకు రైతులకు రైతు భరోసా, మహిళలకు రూ.2500 భృతి ఇవ్వలేదని, పేదలకు పెన్షన్‌ను పెంచలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ దామరచర్ల మండల అధ్యక్షుడు దుర్గంపూడి నారాయణరెడ్డి, సీనియర్ నాయకులు ఎండి. యూసుఫ్, జిల్లా నాయకులు ఆంగోతు హాతీరాంనాయక్, బైరం సంపత్, కుందూరు వీరకోటిరెడ్డి, సోము సైదిరెడ్డి, ధీరావత్ పున్నానాయక్, బాల సత్యనారాయణ, లావూరి శ్రీను నాయక్, అక్కురామ్ నాయక్, రఫీ, రవీందర్, సైదానాయక్, శ్రీను, నాగు, మహేష్, చిన్నబాబు, బాలు, కృష్ణ శ్రీరాములు, లచ్చునాయక్, దస్రు, కృష్ణ పాల్గొన్నారు.

సాగర్‌లో ఎస్పీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-నాగార్జునసాగర్



నాగార్జునసాగర్ ప్రాజెక్టు భద్రత విధులు నిర్వహించే ఎస్పీఎఫ్ దళాల క్రీడా పోటీలు బుధవారం ప్రారంభమ య్యాయి .డ్యాం ప్రత్యేక రక్షక సిబ్బంది క్రీడా పోటీలను స్థానిక ఎస్ఐ సంపత్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో ఎస్పీ ఎఫ్ ఆర్ఐ శ్రీనివాస్, ఎస్ఐ రఘుబాబు ,తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు నిందితులు అరెస్టు



- 35 వేల విలువ గల 1.600 కిలోల గంజాయి, బైకు స్వాధీనం : డీఎస్పీ

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

గంజాయి విక్రయిస్తూ, బైక్ దొంగతనానికి పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసి 35 వేల విలువ గల 1.600 కిలోల గంజాయి, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నట్టు నల్లగొండ డీఎస్పీ కె.శివరాం రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావే శంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈనెల 21 న లింగగళ్ళ పూర్ణ చందు, కానుకుంట్ల జగదీష్ , హరిజన్ మహేష్ దొంగలించిన బైకుపై డీఈఓ ఆఫీసు వైపు ముగ్గురు అనుమానాస్పదంగా వస్తుండగా వన్‌టౌన్ ఎస్సై , సిబ్బందితో కలిసి మిర్యాలగూడ రోడ్డు లో టెలిఫోన్ ఎక్స్చేంజ్ దగ్గరలో వాహనాలను తనిఖీ చేసి నిందితులను పట్టుకున్నారు.నిందితులు సులభంగా డబ్బులు సంపాదించడానికి గంజాయి వ్యాపారం చేయాలని నిర్ణయించుకొని హైదరాబాద్ బాల నగర్ లో 2 కేజీల గంజాయిని కొనుగోలు చేసి కొంత వారి సొంతానికి వాడుకొని మిగిలిన గంజాయిని తీసుకొని నల్గొండ కు ఈనెల 16 నరాత్రి కలెక్టర్ ఆఫీసు సమీపాన జీరాక్స్ సెంటర్ ముందు దొంగిలించిన ద్విచక్ర వాహనంపై వచ్చారు. నిందితుల వద్ద నుండి 1.600 కేజీల గంజాయిని ,ద్విచక్ర వాహనమును స్వాధీనం చేసుకున్నారు. మియాపూర్‌కు చెందిన డీటీడీసీ కొరియర్ బాయ్ లింగగళ్ళ పూర్ణ చందు, ప్రయివేటు జాబ్ చేస్తున్న హరిజన్ మహేశ్, మలక్‌పేటకు చెందిన క్యాటరింగ్ బాయ్ కానుకుంట్ల జగదీష్ ప్రస్తుతం నల్లగొండలోని బీటీఎస్‌రూట్‌లోని శ్రీనివాస కాలనీలో నివాసముంటున్నారు. వారిని అరెస్టు చేసి కోర్ట్ లో హాజరు పరిచినట్టు తెలిపారు. వన్‌టౌన్ ఇన్స్పెక్టర్ రాజ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ. జె. సైదులు ,వారి సిబ్బంది కృష్ణ నాయక్, ఇంద్రా రెడ్డి, శ్రీకాంత్, శకీల్, మధుసూదన్ రెడ్డి, కిరణ్ కుమార్ లను ఎస్పీ అభినందించారు.

20 రోజుల పని నిబంధనను ఎత్తివేయాలి



నవతెలంగాణ-మునగాల

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఉపాధి హామీలో 20 రోజుల పని నిబంధనను ఎత్తివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమపంగు జానయ్య అన్నారు. బుధవారం రేపాలలో నిర్వహించి గ్రామ సభలో అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనిలో 20 రోజు పనిచేసిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని చెప్పటం విడ్డూరంగా వుందన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఎంపిఓ దారా శ్రీనివాస్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పలువురు కూలీలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ తీగల గిరిధర్ రెడ్డి



నవతెలంగాణ-నూతనకల్

అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలో మిర్యాలలో జరిగిన గ్రామసభ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఇంధిరా గాంధీ కలలుగన్న ప్రజాపాలన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు ఎంపీడీవో సునీత ఏపిఓ శ్రీరాములు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మెంచు చక్రయ్య , దరిపెల్లి వీరన్న మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇరుగు కిరణ్, కనకటి పల్ల వెంకన్న, గుణగంటి వెంకన్న, మాజీ సర్పంచ్ గాజుల వెంకటయ్య కోటిరెడ్డి అనంతుల మధు మరికంటి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బిడ్డకు.. ఉత్తమ గౌరవం



- కష్టపడ్డ కార్యకర్తకు మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి
- నమ్మినవారిని అందలం ఎక్కించే గుణం ఉత్తమ్ దంపతులది
- కోదాడ చరిత్రలోనే ఎస్సీ సామాజిక వర్గానికి సముచిత స్థానం

నవతెలంగాణ-కోదాడటౌన్

కాంగ్రెస్ ప్రభుత్వం పేదోడి అందలం ఎక్కించే పార్టీ అని, కష్టపడ్డ కార్యకర్తలను కాపాడుకునే పార్టీ కార్యకర్తలు కష్టాల్లో ఉంటే ఆదుకునే పార్టీ నమ్మిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటూ అందలమెక్కిస్తుందని ఆ పార్టీ నాయకులు చెబుతూ ఉంటే అందరూ అన్ని పార్టీల లాగానే చెబుతున్నారు లే అని పెడచెవిన పెట్టారు. కానీ అందరి అంచనాలను ఉత్తమ్ పద్మావతి దంపతులు తలకిందులు చేశారు. నమ్మిన కార్యకర్తలను, కష్టాల్లో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తలను ప్రతిపక్ష పార్టీగా ఉన్నప్పుడు అనేక కేసులలో జైలు పాలైన కార్యకర్తలను, ఎన్ని కష్టాలు వచ్చినా పట్టిన చేయి విడువని కార్యకర్తలను ఈరోజు నిజంగానే అందలమెక్కించారు. ఒక బహుజన బిడ్డకు అరుదైన గౌరవాన్ని ఇచ్చి కోదాడ చరిత్రలోనే సువర్ణ అక్షరాలతో లెక్కించేలా చేశారు.

గత కొంతకాలంగా కోదాడ మార్కెట్ కమిటీ పదవి ఎవరికి వర్తిస్తుందా అని అందరూ వెయ్యి కండ్లతో ఎదురు చూశారు. అనేకమంది ఆశావహులు ఆ పదవి తమకే రావాలంటూ విస్తృతంగా పైరవీలు చేశారు. సామాజిక వర్గం పరంగా అనేకమంది అనేక విధాలుగా ప్రయత్నించిన వారు చెప్పిన ప్రతి మాటను ఉత్తమ్ దంపతులు విన్నారు. కానీ వారు ఎట్టకేలకు చేయాల్సినటువంటి పని కామ్ముగా చేసుకు పోయారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బహుజన బిడ్డ నడిగూడెం మండల కేంద్రానికి చెందిన ఏపూరి తిరపతమ్మ పేరును ఖరారు చేసి, పార్టీ నిజంగానే పేదోడి పార్టీ అంటూ నిరూపించారు. గత ప్రభుత్వాలలో లాగా డబ్బులు ఉంటేనే పదవులు అనే నానుడిని వారు తిరగరాశారు.

కోదాడ వ్యాప్తంగా చర్చ..

ఏపూరి తిరుపతమ్మ ఒక సామాన్య కార్యకర్త.. గతంలో జెడ్పీటీసీగా పోటీ చేసి ఓటమిపాలైంది. పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు పార్టీ బలోపేతం కోసం కృషి చేసింది. తిరుపతమ్మ భర్త సుధీర్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు సుపరిచితుడు. పార్టీలో ఎన్‌ఎస్‌యుఐ నాయకుడిగా ఉండి పోరాటం చేసిన నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తగా ఆయనకు మంచి పేరు ఉంది. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి నమ్మిన బంటుగా ఆయన పనిచేస్తున్నారు. తదనంతరం పరిణామాల క్రమంలో ఉత్తమ్‌కుమార్ రెడ్డి హుజూర్నగర్ నియోజకవర్గానికి వెళ్లిపోవడంతో తిరిగి కోదాడకు వారి సతీమణి పద్మావతిని రాజకీయాలలోకి తీసుకువచ్చిన క్రమంలో, పద్మావతి రెడ్డి అడుగుజాడల్లో సుదీర్ నడుస్తూ ఆమె గెలుపుకై నిరంతరం కృషిచేసి నడిగూడెం మండలంలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిసారి తిరుగులేని మెజార్టీని అందించడంలో ఒకరిగా ఉన్నారు.

అన్ని వర్గాలకు సమ న్యాయం దిశగా..

నూతనంగా ఏర్పడ్డ పాలకవర్గంలో అన్ని వర్గాలకు సమన్యాయం చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్‌గా మైనార్టీ నుండి ఉత్తమ్ ప్రధాన అనుచరుడు షేక్ బషీర్‌ను నియమించారు. దీంతో మైనార్టీ వర్గానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చినట్లుగా వారి సంకేతాలు పంపించారు. దీంతో పాలకవర్గంలో బడుగు బలహీన వర్గాల కార్యకర్తలకు అత్యంత ప్రధానతను కల్పించడంతో అన్ని వర్గాల నుండి ఉత్తమ్ పద్మావతి నాయకత్వం కు ఆయా వర్గాల నుండి బలమైన మద్దతు లభిస్తోంది.

కష్టపడే వారికి సముచితస్థానం..

మీ దగ్గర డబ్బు ఉందని నేను రాజకీయం చేస్తానంటే ఇక్కడ కుదరదు. ఎందుకంటే ఇక్కడ ఉన్నది ఉత్తమ్ దంపతులు. డబ్బుల కోసం రాజకీయాలు చేసేందుకు అక్రమ సంపాదనకు మొత్తం దంపతులు రాజకీయాలలోకి రాలేదు. ప్రజలకు సేవ చేయాలని ఉద్దేశంతో వచ్చామని వారు ప్రదేపదే పలు మీటింగ్లలో ప్రస్తావించారు ప్రస్తావించిన ప్రతి మాటను అక్షర సత్యం చేశారు. అందుకు ఉదాహరణ కోదాడ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్సీకి కేటాయించడం కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుందని సంకేతాలను వారు పంపించారు ఈ క్రమంలోనే రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో పాటు మున్సిపాలిటీ ఎన్నికలలో కూడా పార్టీ కోసం కష్టపడ్డ నాయకులకి కార్యకర్తలకు పదవులు దక్కుతాయని కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా రాజకీయాలలో డబ్బు ఒకటే ప్రాధాన్యత కాదని, పార్టీకి పనిచేసిన వారికి కూడా ప్రాధాన్యత కల్పిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సంకేతాలను ఇవ్వడం నిజంగా గొప్ప విషయమే.



ఉత్తమ్ పద్మావతి దంపతులకు రుణపడి ఉంటాము: ఏపూరి తిరుపతమ్మ సుధీర్ (మార్కెట్ కమిటీ చైర్మెన్ కోదాడ)

కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా మమ్ములను గుర్తించి అతి చిన్న వయసురాలైన నాకు పెద్ద పదవిని కట్టబెట్టిన ఉత్తమ్ పద్మావతి దంపతులకు రుణపడి ఉంటాము కోదాడ మార్కెట్ ను రాష్ట్రంలోనే ఉత్తమ వ్యవసాయం మార్కెట్‌గా తీర్చిదిద్దేందుకు మంత్రి సహకారంతో ఎమ్మెల్యే సూచనలతో మార్కెట్ అభివృద్ధికి శాయశక్తుల కృషి చేస్తాను.



మంత్రికి ఎమ్మెల్యేకి ప్రత్యేక ధన్యవాదాలు: షేక్ బషీర్ (వైస్ చైర్మెన్ మార్కెట్ కమిటీ కోదాడ)

వ్యవసాయ మార్కెట్ నుఎక్కడ లేని విధంగా రైతులకు మరియు పశువుల సంతను తెలంగాణ రాష్ట్రంలోనే పేరుపొందిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గా అభివృద్ధి పరిచేందుకు మంత్రి గారి సూచనలతో ముందు సాగుతాము మైనార్టీ నేతగా నాకు పదవి కట్ట పెట్టినందుకు పద్మావతి రెడ్డి గారికి ప్రత్యేక శుభాకాంక్షలు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ సూర్యాపేట రూరల్

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని11వ వార్డు రాయనిగూడెంలో సీపీఐ(ఎం) నాయకురాలు షేక్ ఫాతిమా(90) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. వారి భౌతిక గాయంపై సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పూల మాలలు వేసి, నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అదే గ్రామానికి చెందిన గ్రామ రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సీనియర్ నాయకులు కొనతం రాఘవ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న వారిని మల్లు నాగార్జున రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టపల్లి సైదులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మేకనబోయిన శేఖర్, మహిళా సంఘం జిల్లా కోశాధికారి మేకనబోయిన సైదమ్మ, కార్యదర్శి నారాయణ వీరారెడ్డి, కామల్ల లింగయ్య, నాయకులు గుర్రం వెంకటరెడ్డి, కైరోజు బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-సూర్యాపేట రూరల్

రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలనీ ఏఎస్ఐ సాలయ్య,హెడ్ కానిస్టేబుల్ ఇరుగు బాబు అన్నారు. బుధవారం ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్ఐ బాలునాయక్ మండల కేంద్రంలోని రాయినిగూడెం గ్రామ సమీపంలో గల వికాస్ ఫార్మసీ కళాశాలలో రోడ్డు భద్రతా నియమాలు, షీ టీమ్స్, సైబర్ నేరాలపైన, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై, పోలీసు కళాబృందంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ ఇరుగు బాబు మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి, యువత ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని, సైబర్ మోసగాళ్ళ వల్ల మోసాలకు గురి కావద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని అన్నారు. అలాగే రోడ్డు నియమ నిబంధనలు తెలుసుకోవాలని అతివేగం ప్రయాణించవద్దు అని వేధింపులపై 100కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. యువత చెడు వ్యసనాల బారిన పడొద్దని సూచించారు. ఏఎస్ఐ సాలయ్య మాట్లాడుతూ.. ఎవరైనా అపరిచితులు వేధింపులకు గురి చేస్తే షీటీం నెంబర్ 8712686056కు సమాచారాన్ని ఇవ్వాలన్నారు. అనంతరం పోలీసు కళబృందం వారు చక్కటి సాంస్కృతిక, పాటలతో విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వికాస్ ఫార్మసి కాలేజ్ హెచ్ఓడీ నీల, స్వరూప, ఏఓ వినయ్ కుమార్, షీ టీమ్స్ ఏఎస్ఐ సాలయ్య, పోలీస్ సిబ్బంది కానిస్టేబుల్ ఉమా మహేశ్వర్ కళాబృందం ఇంచార్జ్ యల్లయ్య, గోపయ్య, నాగార్జున, చారి, మరియు వికాస్ కాలేజ్ ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

- పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు



నవతెలంగాణ-హుజూర్‌నగర్‌రూరల్

ఈ నెల 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో జరుగనున్న సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగారపు పాండు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నీలంగిరి గ్రామంలో సీపీఎం పార్టీ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ఇంటి ఇంటి ప్రచారంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో విచ్ఛిన్న శక్తులు బలపడకుండా చూస్తాం అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని అన్నారు. ధరఖాస్తులు పేరుతో కాలయాపన చేస్తూ ప్రజాపోరాటాలు తప్పవు అని అన్నారు. ఈ రాష్ట్ర మహాసభలో భవిష్యత్తు పోరాటాలకు రూపకల్పన చేస్తాం అని అన్నారు. రైతులు, కార్మికులు, శ్రమ జీవుల కోసం నిత్యం ప్రజాపోరాటాలు చేస్తున్న సీపీఎం పార్టీని ఆదరించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్, శాఖ కార్యదర్శి యల్లంవెల్లి వీరస్వామి, మండల కమిటీ సభ్యులు పిన్నపురెడ్డి వెంకటరెడ్డి, బండి గోపి, శాఖ సభ్యులు కొరివి శ్రీను, బుజ్జిబాబు,సైదులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- కమిషనర్ శ్రీనివాస్



నవతెలంగాణ-సూర్యాపేట

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక 15వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఈనెల 26 నుండి అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారే కాకుండా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకొని వారు కూడా ఇప్పుడు నిర్వహిస్తున్న వార్డు సభలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజా పాలనలో ప్రజల చెంతకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్,మాజీ కౌన్సిలర్ శ్రీహరి, తన్వీర్, జ్యోతి, డిఈ సత్యరావు, వార్డ్ ఆఫీసర్ రహీం తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) నాయకులు సామ ప్రభాకర్ రెడ్డి మృతి



నవతెలంగాణ-నూతనకల్

మండల పరిధిలోని శిల్పకుంట్ల గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు సామ ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. బుధవారం మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి మృతదేహంపై పార్టీ జెండా కప్పి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు బత్తుల తిరుమలేష్, అల్లిపురం సంజీవరెడ్డి, తొట్ల అచ్చయ్య, లింగయ్య, గజ్జల కృష్ణారెడ్డి, సాయిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొల్లు జనార్ధన్ తదితరులు ఉన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



నవతెలంగాణ-మునగాల

ఈనెల 25నుండి28 వరకు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించే సీపీఐ(ఎం) రాష్ట్ర నాల్గవ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు దేవరం వెంకటరెడ్డి అన్నారు. బుధవారం పార్టీ గ్రామ కమిటీ ఆధ్వ ర్యంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామసభల పేరుతో సంక్షేమ పథకాల అమలులో కాలయాపన చేస్తున్నారు. గతంలో ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని కోరారు. రైతులతో పాటు కౌలు రైతులందరికీ రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శులు కిన్నెర వెంకన్న, గడ్డం వినోద్, లపంగి గోపాలం, ఇటికాల వెంకులు, ముత్తయ్య, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వారి కల్యాణం



నవతెలంగాణ-మఠంపల్లి

శ్రీలక్ష్మీనరసింహ స్వామి మహాక్షేత్రంలో బుదవారం స్వామి వారికి స్వాతి కల్యాణం గరుడసేవ దేవాలయ అర్చకులు అద్దేపల్లి లక్ష్మణాచార్యులు, పద్మనాభా చార్యులు, లక్ష్మీనరసింహ మూర్తి వార్లచే శాస్త్రోతముగా నిర్వహించబడినది. ఈకళ్యాణంలో పీటలపై పాల్గొన్న దంపతులు చనుమల్ల సాంబిరెడ్డి రేవతి, గంగాభవాని దంపతులు, గడ్డిపల్లి రామశాస్త్రి ఝాన్సీ రాణి దంపతులు పాల్గొన్నారు.

చివ్వెంల: పుష్యమాస స్వాతినక్షత్రం సందర్భంగా మండలంలోని ఉండ్రుగొండ గిరిదుర్గంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి శ్రీదేవి, భూదేవి ఉభయదేవేరులతో కల్యాణము అత్యంత వైభవముగా జరిగింది. శ్రీమాన్ రవికుమారాచార్యుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధానాచార్యులు శ్రీమాన్ కృష్ణమాచార్యుల సహకారంతో జరిపించారు.

చైన్ సిస్టం మార్కెటింగ్ కంపెనీలలో చేరి మోసపోవద్దు

నవతెలంగాణ-తిరుమలగిరి

చైన్ సిస్టం గల పథకాలకు సంబంధించిన మార్కెటింగ్ కంపెనీలో చేరి మోసపోవద్దని సీఐ రఘువీర్ రెడ్డి అన్నారు. జిల్లా పోలీసు అధికారి సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు, డీఎస్పీ ఉత్తర్వుల ప్రకారం బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సీఐ రఘువీర్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజలు చైన్ సిస్టమ్ పథకాలు, మల్టీ లెవెల్ మార్కెటింగ్ కంపనిలలో చేరి ఆర్థికంగా మోసపోవద్దని సూచించారు. అలాంటి వాటిని నడిపిస్తున్నవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో చట్టపరమైన చర్యలకు బాద్యత వహిస్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ

- దరఖాస్తులకు గ్రామ, మండల స్థాయిలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు

కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



నవతెలంగాణ-చివ్వెంల

ప్రభుత్వ పథకాలకు అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ అని, పథకాల అర్హుల జాబితాలో పేరు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ప్రజలను కోరారు. బుధవారం జిల్లాలోని చివ్వెంల మండలంలో వట్టిఖమ్మం పహాడ్ గ్రామం పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గ్రామసభల వద్ద స్పెషల్ దరఖాస్తులు అందజేస్తున్నారని దానిలో ఓపికగా వివరాలు పూర్తిచేసి తమకు అందజేయాలని వెల్లడించారు. ఇప్పుడు గ్రామ సభలో చదివిన పేర్లు గతంలో దరఖాస్తులు పెట్టుకున్న వారి పేర్లని, ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు జాబితాలో పేరు రాని వాళ్ళు దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందని పేర్కొన్నారు. కావున ప్రజలు అధైర్యపడకుండా దరఖాస్తులు అందజేయాలని కలెక్టర్ కోరారు. ప్రజలకు పథకాలపై ఎలాంటి అపోహలున్న వెంటనే అధికారులను తెలిపి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. గతంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్లకు 269, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 17 మంది, కొత్త రేషన్ కార్డు కొరకు 212 మంది, రైతు భరోసాకు 26 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. జరిగిన గ్రామసభలో మరల ఇందిరమ్మ ఇళ్లకు 28 మంది, కొత్తగా దరఖాస్తులు చేసుకున్నారని ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 53 మంది, కొత్తగా దరఖాస్తులు చేసుకున్నారని నూతన రేషన్ కార్డుల కొరకు 12 మంది, దరఖాస్తులు చేసుకున్నారని రైతు భరోసాకు 2 రైతులు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. ఇక్కడకు రాలేకపోయిన వారు ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాల కొరకు దరఖాస్తులు చేసుకోవాల అనుకునేవారు మండలాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలలో కూడా వాటి దరఖాస్తులు అందజేయవచ్చని వెల్లడించారు. ప్రజా పాలన గ్రామసభలు విజయవంతంగా నిర్వహించడం పట్ల జిల్లా కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, మండల స్పెషల్ ఆఫీసర్ జగదీశ్వర్ రెడ్డి, తహసిల్దార్ కృష్ణయ్య, గ్రామ స్పెషల్ ఆఫీసర్ సంతోష్, ఏఈఓ వెంకటరెడ్డి, పంచాయతీ సెక్రటరీ రమేష్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీను, అధికారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాన్‌పహాడ్ దర్గా ఉర్సు ఉత్సవాలు

- ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ





నవతెలంగాణ-పాలకీడు

మండల పరిధిలోని జాన్‌పహాడ్ దర్గాలో ఉర్సు ఉత్సవాలు నేటి నుంచి మూడు రోజులపాటు అట్టహాసంగా జరగనున్నాయి. తెలుగు వారే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాదిగా భక్తులు తరలి రానున్నారు. నమ్మిన భక్తుల కోర్కెలు తీర్చే దైవంగా, మత సామరస్యానికి ప్రతీకగా ఉత్సవాలకు ఘనమైన చరిత్ర ఉంది. భక్తులు తమ కోర్కెలు తీరితే కందూరు పేరిట మొక్కులు చెల్లించుకుంటారు. సంతానం లేని వారు సంతానం కలిగితే సైదులు బాబా పేరును పుట్టిన బిడ్డలకు నామకరణం చేస్తుంటారు. ఈ ఉర్సు ఉత్సవాలను వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో, ప్రభుత్వం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు.

జాన్‌పహాడ్ దర్గా చరిత్ర..

సుమారు 400 ఏండ్ల పైబడి మద్రాసు రాష్ట్రంలోని నాగూర్ గ్రామంలో వెలిసిన నాగూర్ షరీఫ్, ఖాదర్ దర్గా విశిష్టతను తెలుగు రాష్ట్రంలో కూడా ప్రచారం చేయాలని తలచి, జాన్‌పహాడ్ సైదా, బాజీసైదా, మొహినుద్దీన్ అనే భక్తులు బయలుదేరారనే కథ ప్రచారంలో ఉంది. ఈముగ్గురు భక్తులు తెలుగు రాష్ట్రాలకు చేరి నాగూర్ షరీఫ్ గొప్పతనాన్ని చాటుతూ ఊరూరా తిరగసాగారు. మత ప్రచారంలో తమ వ్యతిరేకులతో పోరాడి వారు అమరులయ్యారు. వాడపల్లి వద్ద అమరుడైన జాన్‌పహాడ్‌సైదా జ్ఞాపకార్థం వజీరాబాద్ రాజకుమారుడు జాన్‌పహాడ్ వద్ద పవిత్ర సమాదులు కట్టించారని చెప్పుకుంటారు. ఆతర్వాత జాన్‌పహాడ్‌ను సైదా నిర్మించాడని దీని మూలంగానే జాన్‌పహాడ్ దర్గా పేరు వాడుకలోకి వచ్చింది. ఈప్రాంతమంతా నీటి వసతి లేదని తర్జన బర్జన పడుతున్న సమయంలో వేముల శేషారెడ్డి కలలో జాన్‌పహాడ్ సైదా కనిపించి గుర్రం డెక్కలు ఉన్నచోట బావిని తవ్వించమని చెప్పాడట. దీంతో అక్కడ నీరు కనిపించిందని పెద్దలు చెబుతుంటారు.

తరగని ప్రసాదం..

కృష్ణానది తీరాన ఉన్న పొందుగల గ్రామస్థులు ఒక బాలుడితో బయలుదేరి పొరుగూరికి ప్రయాణం అయినారని, మార్గమధ్యంలో సూర్యాస్తమయం కావడం అయినా అదే వెన్నెల రుతువు కావడంతో అడవిలో నడవసాగారు. ఇంతలో వారికి సైదులు బాబా దర్గా గోపురం కనిపించింది. వారి వెంట ఉన్న బాలుడు దర్గాను చూసి వద్దామన్న ఆశతో వేగంగా పరిగెత్తి దర్గాలోకి ప్రవేశించాడు. అప్పటికే రాత్రి అయింది. ఇక్కడ ఎవ్వరూ ఉండరాదని బాలుడికి తెలియక అటూ ఇటూ చూడసాగారు. ఆశ్చర్యం.. అతడికి లోపల ఇద్దరు దివ్య తేజస్సుతో ఉన్న ఇద్దరు పురుషులు ఎంతో మంత్రాలు చదవడం వినిపించింది. ఆసరాగా అటు వైపు వెళ్ళారు. వారు బాలుడిని వద్దకు రమ్మని సైగ చేశారు. వారు బాలుడికి బెల్లం ముక్కను పెట్టి ప్రసాదం తీసుకోమని ఆశీర్వదించారు. బాలుడు ఉత్సాహంగా బెల్లం ముక్కను తీసుకుని తనతో వచ్చిన పెద్దల వద్దకు చేరాడు. వారికి చూసిన విషయాన్ని వివరించి చెప్పి బెల్లం ప్రసాదం వారికి కూడా పెట్టాడు. విచిత్రం ముగ్గురూ పంచుకున్నప్పటికీ బాలుని వద్ద అంతే బెల్లం ముక్క మిగిలింది. ఇది సైదులు బాబామహిమగా చెబుతుంటారు.

నాగుల పుట్ట.. దీపం విశిష్టత

ఆనాడు దట్టమైన అరణ్య ప్రాంతంలో వచ్చే భక్తులకు అండగా ఉండేందుకు నాగుపాము ఉండేదని రాత్రిపూట సైదుల బాబా సమాదిపై పడుకునేదని కథ ప్రచారంలోఉంది. హిందువుల ఆరాధ్య దైవమైన నాగేంద్రుని ముస్లింలు కూడా పూజించడం విశేషం. అలాగే దర్గాలో సమాదులు వెలిసిన నాటి నుండి ఈదీపం నిత్యం వెలుగుతూనే ఉంది. భక్తులు దీపారాధన నూనెను ఎంతో పవిత్రంగా భావించి నొప్పులు ఉన్న చోట రాసుకుంటే తగ్గుతాయని భక్తులు విశ్వసిస్తుంటారు. ఈదీపంలో ప్రతీ శుక్రవారం రోజు వచ్చే భక్తులు నెయ్యి నూనెను దీపంలో పోస్తుంటారు. ఇక్కడికి వచ్చే భక్తులు సమాది చుట్టూ ఉన్న గ్రిల్స్‌కు తాళాలు వేస్తారు. తమ కోర్కెలు తీరిన వెంటనే వచ్చి ఇక్కడ కందూరు చేసుకుని తాలాలు తీయడం అనాదిగా వస్తున్న ఆచారం.

గొల్లబామ గుట్ట.,

జాన్‌పహాడ్ షహీద్ బాబాకు వజీరాబాద్ రాజుకు జరిగిన యుద్ధ సమయంలో ఒక గొల్లభామ రావిపహాడ్ గ్రామం నుండి వజీరా బాద్ వెలుతూ అటుగా వచ్చింది. ఆ యుద్ధ దృశ్యాన్ని చూస్తూ వెళ్తూ ఆమెకు జాన్‌పహాడ్ సైదులు బాబా ఒక హెచ్చరిక చేశారు. అమ్మాయి చూసినంత చూశావు ఇక నీవు వెనకకు చూడకుండా వెళ్ళిపో.. ఒక వేళ నువ్వు వెనకకు చూశావో అక్కడే శిల అయిపోతావు అని సైదులు బాబా హెచ్చరించాడు. అది విన్న గొల్లభామ ముందుకు సాగిపోతూ కొంత దూరం వెళ్ళాక యుద్ధం ఎలా జరుగుతుందో చూడాలనుకుంది. ఆతృతను అదుపు చేసుకోలేక వెనకకు తిరిగి చూసింది. అంతే ఆమె శిలగా మారిపోయిందని పెద్దలు చెబుతుంటారు. గొల్లబామ శిల అయిన ప్రాంతాన్ని భక్తులు గొల్లభామ గుట్టగా భావించి నమస్కరిస్తారు. వచ్చిన భక్తులు తలా ఒక రాయిని ఆమెకు సమర్పించి స్మరిస్తుంటారు.

కందూరు..

జాన్‌పహాడ్ దర్గా వద్దకు ప్రతీ శుక్రవారం దర్శనానికి వచ్చే వారు, ఉర్సుకు వచ్చే వారు అక్కడ తీర్చుకునే మొక్కులను కందూరు అంటారు. కందూరు మొక్కులో మేకపోతు, గొర్రె పొట్టేలును నివేదనగా ఇవ్వడం ఆచారంగా వస్తోంది. భక్తులు తమ మొక్కు ప్రకారం మేక, పొట్టేలును తీసుకొచ్చి వాటికి స్నానం చేయించిన అనంతరం అలాల్ చేయిస్తారు. సఫాయి బావి నీటితో వండి దర్గాలో నివేదన(ఫాయితాలు) ఇచ్చి దర్శనంతో పాటు మొక్కు చెల్లించుకుంటారు. ఆ తర్వాత బంధు మిత్రులకు భోజనాలు పెడతారు. పంచపహాడ్‌లు జాన్‌పహాడ్ కేంద్రంగా మరో నాలుగు పహాడ్‌లు ఉన్నాయి. ఇవి జాన్‌పహాడ్, గుండ్లపహాడ్, శూన్యపహాడ్, గణేష్‌పహాడ్, రావిపహాడ్‌లు. ఇవి పంచభూతాలకు సంకేతాలా లేక బారతీయ ధర్మంలోని పంచాయతన దేవారాధనకు సంకేతాలా అనే చర్చ కొనసాగుతుంది.

అభివృద్ధి, సంక్షేమపథకాల అమలుకు ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి ,సంక్షేమ పథకాలు అమలకు, ప్రజాపాలనలో కృషి చేస్తుందని టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగామ ఉపేందర్‌రెడ్డి అన్నారు.ఆలేరు మండలం కొల్లూరు గ్రామంలో బుధవారం ప్రజాపాలనలో భాగంగా రెండోరోజు గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశలవారీగా అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంజిరెడ్డి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జనగాం శ్రీపాల్‌రెడ్డి, నాయకులు వెంకటేష్‌యాదవ్, పిల్లలమరి శంకరయ్య, దశరథ పాల్గొన్నారు.



ఆర్‌బీఎం హాస్పిటల్స్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చేతుల మీదుగా ఆర్‌బీఎం హాస్పిటల్స్ క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎం హాస్పిటల్స్ మార్కెటింగ్ మేనేజర్ బూడిద నవీన్, మున్సిపల్ చైర్మెన్ సుధా హేమేందర్‌గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మెన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్, ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, గౌలికర్ అరుణ, కాంగ్రెస్ మండలఅధ్యక్షులు కానుగు బాలరాజుగౌడ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు బందారపు భిక్షపతిగౌడ్, గుడ్ల నరేష్, బూడిద భాస్కర్, బూడిద మధు పాల్గొన్నారు.



విద్యాదానం అన్నింటిలోకన్నా మిన్న

● డీఈఓ సత్యనారాయణ

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం



ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదని, విద్యాదానం అన్నింటికన్నా మిన్న అని జిల్లా విద్యాధికారి కే.సత్యనారాయణ అన్నారు.మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉదయం,సాయంత్రం సమయాల్లో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదవ తరగతి విద్యార్థులకు హైదరాబాదుకు చెందిన రిలయబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం రూ.1.50 లక్షల విలువైన అల్పాహారం, పరీక్షాప్యాడ్లు, పెన్నులను జెడ్పీ హైస్కూల్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లకు అందజేశారు. ఈ సందర్భంగా రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవిని డీఈవో అభినందించి సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నింటికీ మూలం చదువేనన్నారు.పట్టుదలతో చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించి ఉన్నతస్థానానికి ఎదగాలని ఉద్బోధించారు.ట్రస్ట్ సమకూర్చిన 50 రోజుల అల్పాహారం సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

హాస్టల్‌లో ఉండి చదువుకున్న: తుపాకుల రవి(రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ)

తాను ప్రభుత్వం ఏర్పాటు చేసిన నవోదయ విద్యాలయంలో చదువుకున్నానని, తాను సంపాదించిన దాంట్లో కొంత అనాథలకు, పేదలకు విద్యాభివృద్ధికి అందజేస్తున్నానని రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి తెలిపారు.పేదరికాన్ని రూపుమాపేది, విద్యార్థుల తలరాతను మార్చేది,బాలల భవిష్యత్తును తీర్చిదిద్దేది చదివేనని వివరించారు. చదువు విలువ తెలుసుకోవాలని,ఎప్పుడూ ఉన్నతస్థానం కోసం పోటీపడాలని సూచించారు. తాను, తనమిత్రులు ఏర్పాటు చేసిన ఈ ట్రస్టు ద్వారా అనాథలకు,నిరుపేదలకు, విద్యార్థులకు, పాఠశాలకు అవసరమైన సహకారాన్ని అందిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో సాహితీవేత్త బడుగు శ్రీరాములు, ఎంఈఓ గోలి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త సుక్కా సుదర్శన్, జడ్పీ బాలికల, బాలుర ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమాదేవి, ఉషారాణి, హనుమంతు, కే.ఉదయ, నర్రా నరసింహారెడ్డి, దీపా జోషి పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు షరతుల్లేని భరోసా అందజేయాలి

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

వ్యవసాయ కూలీలందరికీ ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలని, కూలీలకు షరతుల్లేని భరోసా ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి జి.శ్రీనివాసచారి డిమాండ్ చేశారు.బుధవారం మండలంలోని కంకణాలగూడెం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు.ఈ ప్రాంతంలో ఫ్యాక్టరీ లేకపోవడంతో వ్యవసాయ కూలి తప్ప మరోమార్గం లేక వ్యవసాయ కూలీలు మధ్యతరగతి రైతులు కూడా నీటి వసతులు లేక కేవలం వర్షం నీటి ఆధారంగానే వ్యవసాయలు చేసుకుంటున్నారన్నారు. ప్రత్యేకవర్షాలు పడకపోవడంతో పనిదొరకక కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.భూమితో సంబంధం లేకుండా వ్యవసాయ కూలీ పనిచేస్తున్న కూలీలందరికీ సంవత్సరానికి రూ.12 వేలివ్వాలని డిమాండ్ చేశారు.ఇండ్లు మంజూరు విషయంలో పారదర్శకత పాటించాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సుర్కంటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల శ్రీనివాసరెడ్డి, తుమ్మల సత్తిరెడ్డి, తుమ్మల జలంధర్‌రెడ్డి, సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కర్తల భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్



యాదగిరిగుట్ట మండలం రామాజీపేట బుధవారం, ఒగ్గు పెద్దఎల్లయ్య అనారోగ్య కారణంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని రామాజీపేట తాజా మాజీ సర్పంచ్ మొగిలిపాక తిరుమల రమేష్ పరామర్శించారు. ప్రగాఢసానుభూతి తెలియజేయడంతో రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వ పథకాలు

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

.అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోచంపల్లి ఇన్‌చార్జి తహసీల్దార్ నాగేశ్వరరావు అన్నారు.మండలపరిధిలోని ధర్మారెడ్డిపల్లి, కనుముక్కల, అంకమామిడి గ్రామాలలో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన మాట్లాడారు.ప్రభుత్వం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి రేషన్ కార్డులు ,ఇందిరమ్మ ఇండ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా పథకాలను అందిస్తామని తెలిపారు.అనేక ఏండ్లుగా ఎదురుచూస్తున్న రేషన్‌కార్డులలో కొంతమంది పేర్లు లేకపోవడం,పదేండ్లుగా ఇండ్లు లేకుండా ఉన్న నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల పథకం ముందుగా స్థలం కలిగి ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామన్నారు .ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ఇవన్నీ నిరంతరమైన ప్రక్రియ అన్నారు.గతంలో దరఖాస్తు చేయని వారు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.ఈకార్యక్రమంలో ప్రభుత్వ సిబ్బంది,డీసీసీ జిల్లా ఉపాధ్యక్షులు సామ మధుసూదన్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్‌చైర్మెన్ సామ మోహన్‌రెడ్డి, సామ రవీందర్‌రెడ్డి, పడమటిభూపాల్‌రెడ్డి, శంకరయ్య ,సత్యనారాయణ, చుక్క యాదయ్య పాల్గొన్నారు.

మోటకొండూరు : మండలకేంద్రం, మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామసభలు జోరందుకున్నాయి.కాటేపల్లి, ఇక్కుర్తి, గిరిబోయినగూడెం, చామాపూర్, తేర్యాల గ్రామాల్లో ముమ్మరంగా సాగాయి.చామాపూరు గ్రామసభలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎల్లాంల సంజీవరెడ్డి పాల్గొనగా కాటేపల్లిలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీఓ ఇందిర పాల్గొన్నారు.

చౌటుప్పల్‌రూరల్: చౌటుప్పల్ మండలంలో గ్రామసభలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయని తహసీల్దార్ శివకోటి హరికృష్ణ,మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి.సందీప్‌కుమార్, మండల అగ్రికల్చర్ అధికారి ముత్యాల నాగరాజు, ఎంపీఓ ఉట్కూరు అంజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి.ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి,మాజీ మండల పరిషత్ అధ్యక్షులు తాడూరి వెంకట్‌రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు చక్రంజంగయ్య, ఆల్మాసిపేటకిష్టయ్య,కాయితి రమేశ్‌గౌడ్, చౌట వేణుగోపాల్‌గౌడ్, కొలను శ్రీనివాస్‌రెడ్డి, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ఉత్తటూర్‌లో గోర్ల నరేష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్స్


నవతెలంగాణ-రామన్నపేట

ఈనెల 23న మండలంలోని ఉత్తటూరు గ్రామంలో క్రీడా సమితి ఆధ్వర్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్స్ ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడాకారులు ఎవరి కిట్టు వారే తెచ్చుకోవాలని, పెద్ద బ్యాట్‌కు అనుమతి లేదని సూచించారు. లీగ్ మ్యాచ్ 10 ఓవర్లు, సెమీస్ ఫైనల్ మ్యాచ్ 12 ఓవర్లు ఉంటుందని తెలిపారు.ఎంట్రీ ఫీజు 999 మాత్రమేనని, ఐదుగురు బౌలర్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. గెలుపొందిన టీంకు ప్రథమ బహుమతి 20,016, ద్వితీయ బహుమతి10,016 అందించడం జరుగుతుందని తెలిపారు. ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాకారులు పాల్గొనాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమపథకాలు అందించాలి

నవతెలంగాణ-బీబీనగర్

అర్హులైన వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండలంలోని రాఘవపురం గ్రామసభకు విచ్చేసిన కలెక్టర్ హనుమంతరావుకు బీఆర్ఎస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు సక్రమంగా అమలు చేయాలని నిబంధనల పేరుతో ప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం లబ్ధిదారులను తగ్గించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గుంటిమిది అశోక్, బుయ్య కిషోర్‌గౌడ్, బుయ్య అశోక్, బండారు రాఘవేందర్‌గౌడ్, వంగరి రమేష్ ,శివగోని రంగయ్య, జక్కి నర్సింహ, రాగిజగదీష్, దొంతి రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, దశరథరెడ్డి, సత్తిరెడ్డి, పాల్గొన్నారు.



అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించలేదని ఆందోళన

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

యాదగిరిగుట్ట మండలం బహుపేట బుధవారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించలేదని బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షులు కవిడే మహేందర్ ఆధ్వర్యంలో గ్రామసభలో ఆందోళన చేపట్టారు. అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

దళితుల గోరీలు కూల్చిన వారి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

● లేదంటే ఈనెల 30న పోలీస్ స్టేషన్‌ను ముట్టడిస్తాం

నవతెలంగాణ భువనగిరి కలెక్టరేట్

100 ఏండ్లకుపైగా తమ కుటుంబాలకు సంబంధించినవారు చనిపోతే వారిని బొందపెట్టి, గోరీలను నిర్మాణం చేసుకున్న వాటిని పక్కనే ఉన్న కంఠం దయాకర్, కంఠం దినేష్ అక్రమంగా రాత్రికి రాత్రి జేసీబీలతో ఆ గోరిలను కూల్చి, బొందలను తవ్వి బాయి కుంటలో పోయడాన్ని కేవీపీఎస్ జిల్లా కమిటీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ నిందితులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శి అన్నంపట్ల కృష్ణ పోలీస్ అధికారులను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరి మండలపరిధిలోని తుక్కాపురం గ్రామంలో అక్రమంగా కూల్చిన గోరీలను ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామప్రజలు, బాధిత కుటుంబాలతో కలిసి పరిశీలన చేసి మాట్లాడారు.తొక్కాపురం గ్రామంలోని సర్వే నెం.113లో 1- 20 గుంటల భూమిలో గ్రామం ఏర్పడ్డ నుండి సుమారుగా 150 ఏండ్లకు పైగా గ్రామంలో ఎవరు చనిపోయిన ప్రధానంగా దళితులు చనిపోతే ఆ భూమిలో బొందలు పెట్టడం, కాల్చడం చేసిన తర్వాత ఆర్థికస్తోమతను బట్టి గోరీలు కూడా నిర్మాణం చేసుకున్నారని తెలిపారు.ఆ శ్మశాన వాటిక పక్కనే భూమి కలిగిన కంఠం దయాకర్, కంఠం దినేష్ ఆ భూమిని ఆక్రమించుకోవడానికి కుట్రపూరితంగా రాత్రికి రాత్రి అయిదారు జేసీబీలతో మొత్తం గోరీలను, బొందలను తవ్వి అతి దారుణంగా వాటన్నింటినీ బాయిబొందలో పోసి పూడ్చడం దారుణమని తెలిపారు.అనేకమంది తమ తల్లిదండ్రులు, తాత, ముత్తాతల ఆనవాళ్లను గోరిల రూపంలో చూసుకుంటుంటే ఆ గోరీలను తవ్వి వారి యొక్క అస్థికలను కూడా తీసేయడం హేయమైన చర్యని విమర్శించారు. జనవరి 5న నిందితులు గోరీలను తవ్వితే ఆరవ తేదీన కలెక్టర్, స్థానిక భువనగిరి పీఎస్‌లో కంప్లైంట్ చేసిన నేటికీ నిందితులపై కేసులు నమోదు చేసి ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. ఎక్కువ శాతం దళితుల గోరీలనే ధ్వంసం చేశారని, మరి అలాంటి పరిస్థితులలో వారిపైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ఎందుకు నమోదు చేయలేదని స్థానిక రూరల్ పోలీసులను ప్రశ్నించారు.ఆ గ్రామంలో ప్రజలంతా గత 17 రోజులుగా ఆందోళన చెందుతుంటే కూతవేటు దూరంలో ఉన్న కలెక్టర్, తహసీల్దార్ ఎందుకు స్పందించడం లేదని ఎవరి పక్షాన అధికారులు, పోలీసు యంత్రాంగము ఉన్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం స్పందించి నిందితుల పైన కేసులు నమోదు చేసి చట్టపరంగా శిక్షించాలని, చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేసి ఆ స్మశాన వాటికకు రక్షణ కల్పించాలని, ఈనెల 30 లోపు నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేయకపోతే ఫిబ్రవరి మూడో తేదీన పోలీస్‌స్టేషన్ ముందు వందలాది మందితో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు దుబ్బ లింగం, గ్రామం మాజీ ఎంపీటీసీ నల్లమాసు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ నోముల పద్మ మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ ముంత సతీష్, గ్రామ ప్రజలు బాధితులు రత్నపురం పురుషోత్తం, ఏడుమేకుల మహేష్, ఎదునూరి చంద్రపాల్, రాచకొండ పాండు, కుమార్, చంద్రయ్య, లింగస్వామి, రాసాల శేఖర్, జనగాం అశోక్, స్వామి, సత్తయ్య, శంకరయ్య, శ్రీను, భువనగిరి నగేష్, ఎలకొండ సుధాకర్, రాసాల శరత్, రత్నపురం భిక్షపతి, పాండరి, పిట్టల జమ్మయ్య పాల్గొన్నారు.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

● భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-భువనగిరికలెక్టరేట్

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమపథకాలు అందిస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.బుధవారం భువనగిరి మండలం అనంతారం లో నిర్వహించిన ప్రజాపాలనలో ఆయన కలెక్టర్ హనుమంతరావుతో కలిసి మాట్లాడారు.ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు చేయనున్నందున ఆయా పథకాల క్రింద అర్హులుగా గుర్తించబడిన వారి ముసాయిదా జాబితాను గ్రామ సభలో అందరి సమస్యలను చదివి వినిపించారు.గ్రామ సభలలో లబ్ది దారుల జాబితాలో పేర్లు రాని వారుఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు పరిశీలించి అర్హులందరికీ లబ్ది చేకూరుస్తామని అన్నారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ప్రజా పాలనలో భాగంగా భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు సంవత్సరానికి రూ.12,000 వేల రూపాయల చొప్పున అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



భువనగిరిలో..

భూదాన్‌పోచంపల్లి: సంక్షేమ పథకాలు అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పోచంపల్లి మున్సిపాలిటీ, నాలుగో వార్డుల్లో జరుగుతున్న ప్రజా పాలన గ్రామ సభలో పాల్గొని లబ్దిదారులు ఇచ్చే దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు అమలు చేయనున్నందున ఆయా పథకాల క్రింద అర్హులుగా గుర్తించబడిన వారి ముసాయిదా జాబితాను గ్రామసభలో అందరి సమస్యలను చదివి వినిపించారు.గ్రామ సభలలో లబ్దిదారులు జాబితాలో పేర్లు రాని వారుఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు.ఉపాధిహామీ చట్టంలో నమోదు చేయబడి, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన గుంట భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఈ ఆర్థికసాయం అందిస్తామన్నారు.అర్హుల నిర్ధారణ కోసం సామాజిక-ఆర్థిక సర్వే మీ సేవా దరఖాస్తులు, గ్రామసభలు, వార్డుసభల ద్వారా అందిన దరఖాస్తులను స్వీకరించి, సమగ్రంగా పరిశీలన జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తడక రమేష్, కౌన్సిలర్ చక్రపాణి,సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పైరవీలకు తావు లేకుండా సంక్షేమ పథకాలు

● ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

పైరవీలకు తావు లేకుండా ప్రజలకు సంక్షేమపథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య అన్నారు.బుధవారం పట్టణంలోని 5వ వార్డులో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు పార దర్శకంగా పథకాలు అందించేందుకు ముందుకు సాగుతున్నామన్నారు.తనను గతంలో ఎంపీటీసీగా గెలిపించిన 5వ వార్డ్‌ను అభివృద్ధి చేస్తానన్నారు.సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వాన మహిళలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. 26 నుండి అమలయ్యే పథకాలు అర్హులకే అందుతాయన్నారు.అందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణ వస్తే బతుకులు బాగుపడతాయి అనుకుంటే కాలేదన్నారు. ప్రభుత్వ స్థలంలో అవుట్ చేసి భూమి లేని వారికి ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు రేషన్ కార్డులు పంపిణీ నిరంతర ప్రక్రియ అన్నారు.బీసీకాలనీ కమ్యూనిటీహాల్‌కు రూ.10 లక్షలు మంజూరు చేశారు.వడ్డెర కులాలకు ఉపాధి కల్పిస్తామన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు 200 యూనిట్ల ఫ్రీ కరెంటు ఇస్తున్నామన్నారు.మహిళల ఫ్రీ బస్సు కోసం నెలకు రూ.300 కోట్లు ఆర్టీసీకి కడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ చైతన్యరెడ్డి,మున్సిపల్ చైర్మెన్ ఎరుకల సుధ హేమేందర్‌గౌడ్,కమిషనర్ అజయ్‌రెడ్డి, కౌన్సిలర్లు గుండ్లపల్లి వాణి భరత్‌గౌడ్,ముక్కర్ల మల్లేష్, గౌలికర్ అరుణ రాజేష్, బిట్టు సరోజహరీష్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సాగునీటితో నియోజకవర్గం సస్యశ్యామలం

● కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యేమాల ఎలేందర్‌రెడ్డి

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సాగునీరుతో నియోజకవర్గంలో ప్రతిపల్లెకు నీళ్లు అందించి సస్యశ్యామలం చేశారని పీఏసీఎస్ డైరెక్టర్, కాంగ్రెస్ యాదగిరిగుట్ట మండల వర్కింగ్ ప్రెసిడెంట్ యేమాల ఎలేందర్ రెడ్డి అన్నారు. బుధవారం, యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట, ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలను డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో, అర్హులైన పేదలకు రేషన్ కార్డులు ఇవ్వక పదేండ్ల పాటు కాలయాపన చేసిందన్నారు.బీఆర్ఎస్ పాలనలో పేద కుటుంబాలు సొంతింటి కల నెరవేరక, రేషన్‌కార్డులు రాక నిర్లక్ష్యానికి గురయ్యాయన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు అందజేస్తుందని తెలిపారు.మహాలక్ష్మితో రూ.500 కి గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు మహిళా సాధికారత వైపుకు నడిపిస్తున్నాయని తెలిపారు.బీఆర్ఎస్ పాలనలో యాదగిరిగుట్ట కొండ చుట్టూ రింగ్ రోడ్డు ఎత్తు పెంచి నిర్మించడంతో స్థానికులు, వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు.భక్తులు కొండపైన నిద్ర చేసే వారి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం డార్మెటరీ హాల్ సౌకర్యం కల్పించిందని, భక్తుల కోసం కొండపైన కొబ్బరికాయలు కొట్టు స్థలాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు.కొండపైన భక్తుల కోసం పాతగుండంను పునరుద్ధరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం రుణమాఫీ చేసిందని, అర్హులైన ప్రతి రైతుకు రైతుభరోసా అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు పోతు ప్రవీణ్, రాములు, మల్లయ్య, రాజు, ఉపేందర్, లక్ష్మి ,సంపత్ ,కవిత, భవాని, రమణ, సామి తదితరులు పాల్గొన్నారు.



అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు పథకాలు

● ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

నవతెలంగాణ-భువనగిరి

ఇవి తాత్కాలిక జాబితాలే అని, అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు ప్రభుత్వం పథకాలు అమలవుతాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని హైదరాబ్ చౌరస్తా, ఆర్బీనగర్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ వార్డు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నాలుగు సంక్షేమపథకాలు మున్సిపాలిటీలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పూర్తి స్థాయిలో అమలు అవుతున్నట్లు మిగితా రెండు గ్రామాలలో లబ్దిదారులు ఎక్కువగా ఉన్నారన్నారు.ఈసమావేశంలో భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు. నాలుగు పథకాలు అములలో భాగంగా ప్రతి వార్డుసభ వద్ద ఎస్సై స్థాయి పోలీసు అధికారితో పాటు కానిస్టెబుల్‌తో ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే కుంభం వార్డు సభకు హాజరౌతున్న నేపథ్యంలో హైద్రాబాద్ చౌరస్తా వద్ద ప్రత్యేక పోలీసు బలగాలు ముందస్తుంగా చేరుకున్నారు. కొంత మంది సూఫారి డ్రెస్సుతోపాటు, సీవిల్ డ్రేస్ వేసుకుని ప్రజల మధ్యలో ఉన్నారు. పర్యటన ముగిసే వరకు అప్రమత్తంగా ఉన్నారు. గతంలో పోలీసుల మధ్యలో భువనగిరి పట్టణంలో ఇలాంటి వార్డు సభలు నిర్వహించలేదని ఇదే మొదటి సారి అని ప్రజలు అనుకుటున్నారు.మున్సిపాలిటీలో నాలుగుపథకాలు అమలు అవుతున్నట్లు చెప్పొద్దని కేవలం రెండు పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పాలని బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు రత్నపురం బాలరాం ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే కుంభం మాట్లాడుతున్న సందర్భంగా మధ్యన కలుగజేసుకుని ఇందిరమ్మ ఆత్మీయభరోసా స్థానంలో పట్టణ ప్రజలకు మరొకటి అమలు చేయాలని, ఆ చట్టం కోసం 100 రోజుల పనిపుస్తకం తప్పనిసరి కావడంతో మున్సిపాలిటీ ప్రజలు ఈ చట్టాన్ని కోల్పోతున్నట్లు తెలిపారు.దీంతో పాటు రైతుభరోసా కూడా పట్టణంలో అమలు కావడం లేదని తెలిపారు.ఈసందర్భంగాలో కొద్ది వాగ్వివాదం చేసుకోవడంతో స్థానిక నాయకులు కలుగజేసుకోవడం సద్దుమణిగింది.

పట్టణ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

వెయ్యి గొంతుకలు, లక్ష డప్పులు పట్టణ కమిటీ నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మీసాల గణేష్ హాజరయ్యారు బుధవారం మున్సిపల్ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు అధ్యక్షుడిగా కొండమడుగు మల్లేష్, గౌరవ అధ్యక్షునిగా కొమ్ము సందీప్, గౌరవ సలహాదారులుగా కొండమడుగు మల్లయ్య, ఉపాధ్యక్షులుగా పోతగల ధనంజయ, బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కుక్క సంపత్, సహాయ కార్యదర్శిగా ఎర్రమల్ల గిరిబాబు, సోషల్ మీడియా కార్యదర్శిగా కొండమడుగులింగస్వామి, ప్రచార కార్య దర్శిగా పోతగలశేఖర్, సాంస్కృతిక కార్య దర్శిగా పోతగల పృథ్వి, సభ్యులుగా జక్కయ్య యాదగిరి, కొండ మడుగు శ్రీశైలం, కొమ్ము ధనుంజయ, కొమ్ము సంతోష్, కుక్క సంజీవ, జోగుబాబు, కొమ్మురాజులను ఎన్నుకున్నారు.

నిరుపేదలకు రేషన్‌కార్డులు, ఇంటి స్థలాలు ఇవ్వాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

అర్హులైన నిరుపేదలకు , రేషన్ కార్డులు , ఇంటి స్థలాలు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ కొలనుపాక గ్రామ శాఖ సమావేశం గ్రామ శాఖ కార్యదర్శి పొన్నబోయిన రవి అధ్యక్షతన మంగళవారం రాత్రి నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి మండలంలోని గౌస్‌నగర్ గ్రామంలో అరిగే ఉదయ్ భాస్కర్ అనారోగ్యంతో చికిత్స పొందగా సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహాయంతో మంజూరైన రూ.60,000 చెక్కును భాస్కర్‌కు గ్రామంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాక వెంకటేష్‌యాదవ్ అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చీర్క మల్లారెడ్డి, శ్రీగోపాలకృష్ణ గొర్రెల మేకలసంఘం అధ్యక్షులు పాక జహంగీర్ యాదవ్, నాయకులు రాగీరు కృష్ణగౌడ్, అరిగే శంకర్, పాక మహేష్ యాదవ్, చిరుక మధుసూదన్‌రెడ్డి, పల్లెర్ల మహేందర్, పాక శ్రీకాంత్, భూషబోయిన సాయి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆలేరు పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలకు విశేష స్పందన

నవతెలంగాణ-ఆలేరుటౌన్



మండలకేంద్రంలోని పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలకు విశేష స్పందన లభిస్తుందని ఆలేరు సబ్ పోస్టుమాస్టర్ ముడుపు భూపాల్‌రెడ్డి బుధవారం తెలిపారు.వారం రోజుల నుంచి 150 మందికి పైగా వివిధ రకాలైన ఆధార్ సేవలను, పోస్టాఫీస్‌లో పొందినట్లు వివరించారు.ఆధార్ సేవలు కావాల్సిన వారందరూ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సేవలు పొందవచ్చన్నారు.పేర్లలో అక్షరాల తప్పులు, పేరు మార్పు, ఇంటి పేర్లలో తప్పులు దొర్లిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

27న మెనూచార్జీలు పెంచాలని ధర్నా

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

మార్కెట్ ధరలకు అనుగుణంగా కోడిగుడ్లు, మధ్యాహ్న భోజన పథకానికి మెనూచార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 27న సోమవారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజనవంట కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ పిలుపునిచ్చారు.బుధవారం మెనూచార్జీలు పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏడీ ప్రశాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ కోడుగుడ్డు ధర మార్కెట్‌లో రూ. 8 ఉండగా ప్రభుత్వం రూ.5 మాత్రమే చెల్లించడంతో కార్మికులుపై రూ.3 అదనపుభారం పడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంతాజ్‌బేగం, నాయకులు నిర్మల, పారిజాత, పుష్ప, గంగమ్మ కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ భారీ ప్రదర్శనను విజయవంతం చేయండి

నవతెలంగాణ-మోటకొండూర్

మండలంలోని నాంచారిపేట గ్రామంలో బుధవారం ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఆడెపు శ్రీనివాస్‌మాదిగ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరిగే లక్ష డబ్బులు వేయి గొంతులతో భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంధమల్ల జహంగీర్‌మాదిగ, ప్రధాన కార్యదర్శి గంధమల్ల మధుమాదిగ, సీనియర్ నాయకులు గంధమల్ల కరుణాకర్‌మాదిగ, గంధమల్ల నరసింహమాదిగ, చిట్టి గల్లాఉప్పలయ్య,ఆడేపు భిక్షపతి, గంధమల్ల భిక్షపతి మాదిగ, గంధమల్ల స్వామి మాదిగ,కొంగరి భిక్షపతిమాదిగ,గంధమల కిరణ్‌మాదిగ, కొంగరి అండాలుమాదిగ, గంధమల్ల ఎల్లమ్మ,కోల రేణుక మాదిగ,గంధమల్ల రామచందర్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత క్రీడలు ఎంతో అవసరం

● చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

గ్రామీణప్రాంత క్రీడలు నిర్వహించి యువకుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలని చౌటుప్పల్ ఏసీపీ పటోళ్ల మధుసూదన్‌రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో రాజన్నసైన్యం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి మాట్లాడారు. జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించి క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీయడం గర్వించదగ్గ విషయమన్నారు.అనంతరం ఏసీపీని, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్‌ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్,ఐఎన్‌టీసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బోయ రామచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బోయ దేవేందర్ మాజీ ఉపసర్పంచ్ బోయఅంబేద్కర్,నాయకులు కడగంచి వెంకటేష్, దూడల అశోక్‌గౌడ్,జాజుల అంజయ్య, చింతల దేవరాజ్, మాదగోని అంజయ్య ,నర్సింహ, యాదయ్య, జగదీశ్, టోర్నమెంట్ నిర్వాహకులు బోయ వెంకట్,అంతటి జగదీశ్, కడగంచి అన్వేష్,సంపత్, వంశీ, అరవింద్, రాజు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



గురుకుల స్టడీ మెటీరియల్ అందజేత

నవతెలంగాణ-రామన్నపేట

రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో ఆసరా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రాథమికపాఠశాలలోని నాల్గో తరగతి విద్యా ర్థులకు గురుకుల పరీక్షకు సంబంధించిన స్టడీ మెటీరి యల్‌ను ఆ ఫౌండేషన్ చైర్మెన్ మేడి కృష్ణ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేష్, గోపాలరెడ్డి, కృష్ణ, స్వర్ణలత, ,సామజిక కార్యకర్త వేముల సైదులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పార్వతమ్మకు ఘన నివాళులర్పించిన చెరుపల్లి

నవతెలంగాణ-మునుగోడు



సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం తల్లి నెల్లికంటి పార్వతమ్మ ఇటీవల మృతి చెందడంతో బుధవారం సీపీఐ(ఎం) జాతీయ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు సత్యాన్ని పరామర్శించారు. పార్వతమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట చిట్యాల మాజీ సర్పంచ్ జిట్ట నగేష్, సీపీఐ(ఎం) చిట్యాల మండల కార్యదర్శి అవిశెట్టి శంకరయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ శ్రవణ్ కుమార్, మాజీ సర్పంచ్ సురిగి చలపతి, తీర్పారి వెంకటేశ్వర్లు, ఈదులకంటి కైలాస్, కట్కూరి లింగస్వామి తదితరులు ఉన్నారు.

బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-మర్రిగూడ

మండలంలోని దామెర భీమనపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో భేటీ బచావో-బేటి పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు.ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత చదువుల వరకు ఉచిత విద్యను అందిస్తుందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.విద్యార్థులు చదువుకు ప్రాముఖ్యతను ఇస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద గారు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంజీవరావు గారు,ఏఎన్ఎం సరిత,అంగన్వాడీ టీచర్ మరియమ్మ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్‌కు మరో వంద కోట్లు

- అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష

నవతెలంగాణ-పాలకీడు



మెటల్ రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని అధికారులను

మండల పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జవహర్ జాన్ పాడు లిఫ్ట్ ఎత్తిపోతల పథకానికి, మరో 100 కోట్లు కేటాయించి సామర్థ్యం పెంచారు. ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర సచివాలయంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఆర్ 11 వరకు పొడిగించాలని, ఇందుకు రూ.100 కోట్లు, బెట్టెతండా చెక్ డ్యామ్‌కు రూ.7.5 కోట్లు, కృష్ణానది లిఫ్ట్ నీళ్లతో జాన్ పహాడ్ చెరువును నింపటానికి తగు చర్యలు తీసుకోవాలని, జాన్ పహాడ్ నుంచి కృష్ణా నది పంపు హౌస్ వరకు కోటి రూపాయలతో మెటల్ రోడ్డు పనులు వెంటనే మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 19న లిఫ్ట్ నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రికి, ప్రాజెక్టు సామర్థ్యం పెంచాలని స్థానికుల నుంచి విజ్ఞప్తులు వచ్చాయి. వెంటనే ఈ అంశంపై సోమ నాయకుడు ఉత్తమ్ దృష్టి పెట్టి పరిష్కారం చూపారని, స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జ, చీఫ్ ఇంజనీర్ రమేష్, పాలకవీడు మండల పార్టీ అధ్యక్షుడు ఎస్ వి సుబ్బారావు, మాజీ ఎంపీపీ భూక్యా గోపాల్ నాయక్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మోతిలాల్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సప్పిడి నాగిరెడ్డి, యల్లాపురం మాజీ సర్పంచ్ తీగల వెంకట్ రెడ్డి లు పాల్గొన్నారు, సమావేశానంతరం మండల నాయకులు మంత్రి ఉత్తమ్ కి కృతజ్ఞతలు తెలిపారు.

రెండో రోజు గ్రామసభలు రసాభాసే

- జాబితాలో పేరు లేకుంటే ఆందోళన అవసరం లేదు
- ఇన్‌చార్జి కలెక్టర్ జయశ్రీ

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం



మండలంలో రెండవ రోజు నిర్వహించిన గ్రామ సభలు అధికారుల నిలదీత, ఆందోళనలతో రసాబసగా కొనసాగాయి. కాంగ్రెస్ ప్రతి ష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు,కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో తెలుసుకునేందుకు గ్రామసభకు వచ్చిన లబ్దిదారులకు నిరాశ ఎదురైంది. బుధవారం మండలంలోని గుడిమల్కాపురం, లింగంవారిగూడెం, చిల్లాపురం, జనగాం, కంకణాలగూడెం, మల్లారెడ్డిగూడెం, మమ్మదాబాద్, పల్లగట్టు తండాలలో గ్రామసభలు నిర్వహించారు. 5,10 ఎకరాల భూమి, సొంతిండ్లు ఉన్న వారి పేర్లు రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో ఉండి గుంట భూమిలేని నిరుపేదల పేర్లు లేకపోవడంతో రభస మొదలైంది. అధికార ప్రతిపక్ష పార్టీ అనే తేడా లేకుండా అధికారులపై లీడర్లు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. మండలంలోని గుడిమల్కాపురంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం 354 మంది దరఖాస్తులు చేసుకోవడంతో అధికారులు ఇటీవల నిర్వహించిన ఇంటింటి సర్వేలో వాళ్లందర్ని ఫొటోలు దింపుకున్నారు.124 మంది పేర్లు మాత్రమే గ్రామసభలో చదివారు.కొత్త రేషన్‌కార్డుల కోసం 203 మంది దరఖాస్తులు చేసుకోగా 20 మంది పేర్లు మాత్రమే గ్రామ సభలో చదివారు.అధికారులు చదివిన లబ్దిదారుల జాబితాలోని పేరు గలవారు ఎక్కువమంది అనర్హులంటూ అర్హులైన వారి పేర్లు జాబితాలో లేవంటూ ఆరోపణలు చేస్తూ అధికారులపై అధికార ప్రతిపక్ష పార్టీ తేడా లేకుండా మహిళలు, నాయకులు ప్రశ్నల వర్షం కురిపించారు. అధికారులు తీసుకువచ్చిన అనర్హుల జాబితాను రద్దుచేసి అర్హులైన లబ్దిదారుల జాబితాను ఎంపిక చేయాలని పట్టుబట్టారు.ఈ మేరకు గ్రామ సభలో తీర్మానం చేయాలంటూ నిలదీశారు.గ్రామసభను పర్య వేక్షించేందుకు వచ్చిన ఇన్‌చార్జి కలెక్టర్ జయశ్రీ మాటా డుతూ జాబితాలో పేరు లేకుంటే ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. తిరిగి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటి ఇంటికి రేషన్‌కార్డు ఇవ్వాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. ప్రతి ఒక్కరికి కనీసవసతులు అందాలన్నదే ప్రభుత్వ నిర్ణయమన్నారు.ప్రభుత్వ పథకాలు ఒకేసారి అందరికీ అందించడం సాధ్యం కాదన్నారు. విడతలవారీగా అర్హులందరికీ అందు తాయన్నారు.ఈ కార్యక్రమంలో అధి కారులు శ్రీనాథ్‌రెడ్డి, ఎం.కృష్ణ, గీతామధవి, ప్రమోద్ కుమార్, నర్సింహారావు, జానయ్య, పాండు, అనురాధ, మమత, బి.వెంకన్న, సతీష్‌బాబు, వర్షిత, బాలకృష్ణ, శివకుమార్, నవీన్, నవ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

- పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు

నవతెలంగాణ-కోదాడటౌన్



సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి సీపీఐ(ఎం) ప్రచార కార్యక్రమాన్ని బుధవారం కోదాడ ప్రచార ప్రచార పట్టణంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ(ఎం) రాష్ట్ర 4వ మహాసభలు జనవరి 25 నుండి 28 వరకు సంగారెడ్డి పట్టణం లో జరుగుతున్నాయని ఈ మహాసభల జయప్రదానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారులకు వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో సంవత్సరం కాలం గడిచిన నేటికీ ఏ సంక్షేమ పథకం అమలు జరగలేదని వారు విమర్శించారు. రానున్న కాలంలో ప్రజా పోరాటాల విస్తృతంగా జరిగేందుకు ఈ మహాసభలు జరుగుతున్నాయని ఈ మహాసభలకు ప్రజలందరూ సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మేదరమట్ల వెంకటేశ్వరరావు పార్టీ కోదాడ పట్టణ కార్యదర్శి ముత్యాలు, పట్టణ కమిటీ సభ్యులు దాసరి శ్రీనివాస్, నాయకులు పోయిలపొంగు కాటయ్య, రామారావు, కొలికపంగువెంకటేశ్వర్లు, భూమా శ్రీను చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయం

- ఎమ్మెల్యే వీరేశం

నవతెలంగాణ-నకిరేకల్



పేద ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం పేర్కొన్నారు. బుధవారం స్థానిక శ్రీ శ్రీనివాస నర్సింగ్ హోమ్ ఆవరణలో రాపోలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో యశోద హాస్పిటల్ మలక్ పేట సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల రీత్యా వయస్సు తో నిమిత్తం లేకుండా ప్రజలు వివిధ రోగాల బారిన పడుతున్నారన్నారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ ఏడాదికోసారి రక్త పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరిగా మారిందన్నారు. పేద ప్రజలు ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాపోలు ఫౌండేషన్ చైర్మన్, ఐఎంఏ నకిరేకల్ శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాపోలు రఘునందన్ మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రతి ఏటా రాపోలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో 460 మందికి సుమారు రూ. 2,600 విలువ చేసే వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాపోలు ఫౌండేషన్ ప్రతినిధి డాక్టర్ రాపోలు మంజుల, యశోద మలక్ పేట వైద్య సిబ్బంది, శ్రీనివాస నర్సింగ్ హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-ఆలేరుటౌన్



క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక ధృఢత్వం ఏర్పడుతుందని ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య అన్నారు. ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో గ్రామ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడారు. గ్రామ యువత ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ కు దాతలుగా సహకరించిన,గాదె సోమిరెడ్డి, షీల్డ్, భీమగాని సంతోష్ గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు అందజేశారు.అనంతరం పాఠశాల విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్ని అలరించాయి.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ సెల్ ఫోన్ యుగం నడుస్తున్న సందర్భంలో క్రీడలు ఏర్పాటు చేయడం చాలా శుభ పరిణామమని అని ని ర్వాహకులను అభినందించారు. కొ లనుపాక గ్రామాన్ని అన్ని రకాలలో అభివృద్ధి చేస్తానని, పాఠశాలలో కొన్ని మౌలిక సదుపాయాలను అతి త్వరలోనే పరిష్కారం చేస్తారని తెలిపారు. కొలనుపాక గ్రామంలో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేసి ఒక మంచి మార్పును కొలనుపాకలో తీసుకువస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా క్రీడల నిర్వాహకులు గాదె సోమిరెడ్డి, భీమగాని సంతోష్‌లను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగామ ఉపేందర్‌రెడ్డి, కొలనుపాక మాజీ సర్పంచ్ ఆరుట్లలక్ష్మీ ప్రసాద్‌రెడ్డి,మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కొండరాజు వెంక టేశ్వర రాజు, మార్కెట్ డైరెక్టర్ మైసయ్య, మాజీ ఎంపీటీసీ ఆరే ప్రశాంత్, నాయకులు తుంగకుమార్, జగతయ్య యాదవ్, రాజయ్య, మోత్కూర్ ఐలయ్య, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

12వ వార్డును సొంత వార్డుగా చూసుకుంటా

- వార్డు అభివృద్ధి నా వ్యక్తిగత బాధ్యత
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

నవతెలంగాణ-యాదగిరిగుట్ట



12వ వార్డును స్వంత వార్డుగా చూసుకుంటానని,వార్డ్ అభివృద్ధి నా వ్యక్తిగత బాధ్యతగా తీసుకుంటానని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట 12వ వార్డులో అమృత్ పథకం కింద రెండు కోట్ల రూపాయలతో గణేష్‌నగర్‌లో 12 లక్షల లీటర్ల వాటర్‌ట్యాంక్ నిర్మాణపనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదగిరిగుట్ట పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన యొక్క లక్ష్యమన్నారు.నీటి సరఫరాను మెరుగుపరచడం కోసం వాటర్ ట్యాంకుల నిర్మాణం జరుగుతుందన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో నీటి సరఫరాకు భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని అన్నారు. యాదగిరిగుట్ట పట్టణం నుండి పాతగుట్ట వరకు మూడు కోట్ల రూపాయలతో త్వరలో పక్కా బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుందని. త్వరలోనే రోడ్డు పనులకు టెండర్ వేస్తున్నారన్నారు.గతం లాగానే స్వామివారి తోరణాన్ని గణేష్‌నగర్‌లో ఏర్పాటు చేయిస్తానని, చౌరస్తా వద్ద సర్కిల్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గణేష్‌నగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.5 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. గతంలో తనను ఎంపీటీసీగా, ఎమ్మెల్యే ఎలక్షన్‌లో కూడా అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఈ వార్డు ను సొంతంగా నేను అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. 12 వార్డ్ మున్సిపల్ కౌన్సిలర్ బబ్బురి మౌనిక శ్రీధర్,వార్డ్ ప్రజలతో కలిసి ఇచ్చిన వినతిపత్రం లోని సమస్యలను అన్నిటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ ఎరుకల సుధా హేమేందర్‌గౌడ్ మున్సిపల్ కమిషనర్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మెన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, కౌన్సిలర్ దండబోయిన్ అనిల్, నాయకులు గుండ్లపల్లి భరత్, సీస కృష్ణ,గౌలికర్ రాజేష్,కాటబత్తినిఅంజనేయులు, వడ్లోజు వెంకటేష్, సుడుగు శ్రీనివాస్‌రెడ్డి, రచ్చ శ్రీనివాస్, బెజుగం శివకుమార్ గుల్లపల్లి శ్రీరాములు, స్వామి,రాజేశ్వరి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను బ్రాహ్మణులు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-డిండి



ప్రభుత్వ పథకాలను బ్రాహ్మణులు వినియోగించుకోవాలని దేవరకొండనియోజకవర్గ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రవి ప్రసాద్ కోరారు. బుధవారం దేవ రకొండ నియోజకవర్గం బ్రాహ్మణ సంఘం సమావేశమును డిండి మండలం గోనబోయినపల్లి గ్రామంలో గ్రామ పురోహితులు సురభి రఘు చరణ్ నివాసంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అందరూ వినియోగించుకోవాలన్నారు. గ్రామాలలో పట్టణాలలో అర్చకత్వం చేస్తూ ఇల్లు లేని బ్రాహ్మణులు చాలామంది ఉన్నారని ప్రభుత్వం వారికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పథకాలు బ్రాహ్మణులకు కూడా వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో రాబోయే విశ్వావసు నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ, ముద్రణ పై చర్చించారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు కురుమేటి బిక్షపతి, శర్మ పాల సదాశివశర్మ, చెర్కుపల్లి అజయ్ శర్మ, వైద్యుల కృష్ణమూర్తి, గారపాటి భాస్కర శర్మ, గొట్టిముక్కల గణేష్ శర్మ, కన్వీనర్ కురుమేటి వంశీ, ఉపాధ్యక్షులు బహుగానం చంద్రశేఖర్ శర్మ, కురుమేటి ఉమాశంకర్, సురభి ప్రభాకర్ శర్మ ఉప్పల శ్రీనివాస్ శర్మ, గాదె కిశోర్, డేరమ్ సతీష్ శర్మ, నెమల్ల వెంకట్, సురభి శ్రీచరణ్, వెంకటాచార్యులు, మీడియా కార్యదర్శి గాదె గిరిధర్, గణేష్ పాండే తదితర బ్రాహ్మణులు పాల్గొన్నారు.

చెరువులకు జీవం పోసేది కాలువలే

- ఫీడర్ ఛానల్ మరమ్మతులకై ఇరిగేషన్ అధికారుల సర్వే
- చెరువు నిండినప్పుడే భూగర్భ జలాలు పెరుగుతాయి
- కొంపల్లి పార్వతి రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మెన్‌వెదిరె విజేందర్ రెడ్డి

నవతెలంగాణ-మునుగోడు



వర్షం కుర్సునప్పుడు ప్రతి వర్షపు చుక్క వృథా కాకుండా కాలువల ద్వారా చెరువులోకి చేరినప్పుడే చెరువులు నిండుకుండలా ఉంటాయని కొంపల్లి పార్వతి రామ లింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మెన్ వెదిరె విజేందర్ రెడ్డి అన్నారు. బుధవారం నారాయణపురం మండల పరిధిలోని పుట్టపాక గ్రామం నుండి మునుగోడు మండలంలోని కొంపల్లి పెద్ద చెరువు వరకు ఉన్న ఫీడర్ కాల్వను మరమతులు చేపట్టేందుకు ఇరిగేషన్ అధికారులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు . ఫీడర్ ఛానల్ నుండి నీళ్ళు వచ్చే కాల్వలో కల్వర్టు నిర్మాణం , చెరువు కట్టపై ఉన్న కంప చెట్లను తొలగించుటకు అవసరమైన నిధుల మంజూరుకు ఎస్టిమేషన్ కోసం సర్వే చేశారు. ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ వర్షాకాలంలో చెరువు నిండినప్పుడే భూగర్భ జలాలు పెరిగి గ్రామంలోని రైతులు వర్షం పై ఆధారపడకుండా వ్యవసాయ సాగు చేయవచ్చని తెలిపారు. చెరువు నిండితే గ్రామంలోని అన్ని రంగాల వృత్తిదారులు ఉపాధి పొందడంతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈలు గోపి,సంపత్ రెడ్డి, లష్కర్ అంజయ్య ,మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు సూర శంకరయ్య, జీడిమండ్ల మల్లయ్య, సంకు శంకర్, బొల్లెపల్లి సాయిలు, నాంపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జాబితాలో అర్హుల పేర్లు లేవని ప్రజల ఆగ్రహం

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామసభలు బుధవారం జరిగాయి. మండలంలోనీ మక్తాకొత్తగూడెం, రామన్నగూడెం, అస్లా తండా, శెట్టిగూడెం, పాత సూర్యపేట, దుబ్బతండ, కొత్త తండ, బోరింగ్ తండ, గ్రామాల్లో గ్రామసభ లు నిర్వహించారు.కాగా గ్రామ సభలు పాల్గొన్న ప్రజలు ప్రధానంగా అర్హులకు ఇలా జాబితాలో పేర్లు లేవని అనర్హులు ఉన్నారంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాలలో పింఛన్, మహిళ ఆత్మీయ భరోసా విషయాల పై అడిగినప్పటికీ మొదటి రోజు అన్ని గ్రామాలలో అధికారుల పై మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, మండల అధికారులు తహసిల్దారు హరిచంద్ర ప్రసాద్, ఎంపీడీవో ,హాసీ0 వ్యవసాయ అధికారిని దివ్య, సూపర్నెంట్ వెంకటాచారి, ఎంపీఓ రాజేష్ ,వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల ఒలింపియాడ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికైన నవదీప్

నవతెలంగాణ-చిలుకూరు

సూర్యాపేట జిల్లా స్థాయిలో జరిగిన ఆంగ్ల ఒలింపియాడ్‌లో మంచి ప్రతిభ కనపరచడంతో నవదీప్ రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ గురవయ్య అన్నారు. బుధవారం మండలంలోని బేతవోలు గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుతున్న నవదీప్ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో పాఠశాల ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అభినందించిన సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులు అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం ఎస్ కవిత ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

నవతెలంగాణ-తిరుమలగిరి

విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ప్రిన్సిపల్ సంజీవ్ కుమార్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ (అనంతారం)లో విద్యార్థులకు ఆట వస్తువులు, క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని. చదువుల్లో రాణించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని, క్రీడల ద్వారా శరీర దారుఢ్యంతో పాటు మానసిక ధైర్యం పెంపొందుతుందని అన్నారు. అదేవిధంగా క్రీడల్లో రాణించే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నారు. చిన్నతనం నుంచే గెలుపు ఓటములను అలవర్చుకుంటే జీవితంలో ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా తట్టుకునే అవకాశం ఉంటుందన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి యువత పాటుపడాలి

నవతెలంగాణ-మోతె

డ్రగ్స్ రహిత సమాజం కోసం యువత పాటుపడాలని మోతె ఎస్సై యాదవేందర్ రెడ్డి అన్నారు. బుధవారం మోతె పోలీస్ స్టేషన్‌లో డీవైఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 'గంజాయి, డ్రగ్స్ నిర్మూలిద్దాం- యువతను కాపాడుకుందాం' అని పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఎంతో భవిష్యత్తు ఉన్న యువత మారక ద్రవ్యాలకు, గంజాయికి అలవాటు పడి ఎంతోమంది తమ జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీవితం చాలా విలువైనదని, డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం గా కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వంతో డివైఎఫ్ఐ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు మట్టిపల్లి సైదులు, డివైఎఫ్ఐ మోతే మండల అధ్యక్షులు వెలుగు మధు, మాజీ డివైఎఫ్ఐ నాయకులు పోతయ్య, దోస పాటి శ్రీను, ఎడ్ల సైదులు పాల్గొన్నారు.

కంటి చూపును మెరుగుపరచాలన్నదే రాజన్న లక్ష్యం



నవతెలంగాణ-మునుగోడు

మునుగోడు నియోజకవర్గంలోని ప్రజలు కంటి చూపు సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి కంటి చూపు మెరుగుపరచాలన్నదే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి లక్ష్యం అని కొంపెల్లి మాజీ సర్పంచ్ జాల వెంకన్న యాదవ్ అన్నారు. ఇటీవల కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి ఆపరేషన్ అవసరమైన వారికి హైదరాబాదులోని నానకరామ్ గూడా లోని శంకర కంటి ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ చేయడంతో బుధవారం ఆపరేషన్ చేసుకున్న వారిని ఆయన పరామర్శించి, పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి కుటుంబానికి ఎలాంటి ఆపద వచ్చిన ఆదుకునే ఆపద్బాంధవుడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అని అన్నారు .ఆయన వెంట యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాల మణి తదితరులున్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-హుజూర్‌నగర్



పట్టణంలోని టౌన్‌హాలులో బుధవారం పాస్టర్స్ ఫెలోషిప్ వారి ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ పట్టణ కార్యదర్శి తన్నీరు మల్లికార్జున్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన మెగా ఉచిత వైద్య శిబిరంలో 300కు పైగా పరీక్షలు నిర్వహించి ఈసీజీ టుడి ఏకో యూరిన్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్య సహాయం అందించారు. ఆరోగ్యపరంగా తీసుకోవలసిన జాగ్రత్తలను వారు వివరించారు. హైదరాబాద్ చెందిన డాక్టర్లు గుండె వైద్య నిపుణులు డాక్టర్ రాపోల్ కరుణాకర్ ఎముకల వైద్య నిపుణులు కిరణ్ వర్మ ఉద్ధం రాజు మహిళా వైద్యులు పరీక్ష నిర్వహించి రోగులకు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ కేజే ఉదయ బాబు, టి కృపానందం, కే సతీష్, ఆర్ ఫిలిప్స్ యోహాన్ సునంద రావు, సామి జాన్ వెలస్లీ, మాజీమున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, ఉపేందర్, మేళ్లచెరువు మొక్కంటి డేవిడ్ పాల్ సుధాకర్ గండు సామెల్ దేవ సహాయం రవికాంత్ రాజు అశోక్ పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కొండమల్లేపల్లి



సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్ కోరారు.. మంగళవారం పీఏపల్లి మండల పరిధిలోని అజ్మాపురం గ్రామంలో సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్నటువంటి సీపీఐ(ఎం) రాష్ట్ర నాలుగో మహాసభలకు ప్రతి ఒక్కరు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలకు పొలిటి బ్యూరో సభ్యులు బృందాకరత్, బివి రాఘవులు, విజయ రాఘవ, పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో పాటు పలువురు నాయకులు హాజరవుతారని రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలంతా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏ పల్లి మండల కార్యదర్శి కావలి కృష్ణయ్య, గ్రామ కార్యదర్శి కె. చిరంజీవి, మండల కమిటీ సభ్యులు కే. కవిత, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు

నవతెలంగాణ-నేరేడుచర్ల

అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని మున్సిపల్ చైర్మెన్ బచ్చలకూరి ప్రకాష్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో పదో వార్డు కౌన్సిలర్ నూకల సుగుణమ్మ అధ్యక్షతన నిర్వహించిన ప్రజాపాలన వార్డు సభల కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. అర్హులై ఉండి జాబితాలో పేరు లేని వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గత 11 సంవత్సరాలుగా రేషన్ కార్డులు లేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని, రైతు రుణమాఫీ 90 శాతం పూర్తయిందని, ఈనెల 26 నుండి రైతు భరోసా మొదలవుతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ నాలుగు సంవత్సరాల పాటు నిర్విరామంగా కొనసాగుతుందన్నారు. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో నేరేడుచర్ల మున్సిపాలిటీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనతం చిన్న వెంకటరెడ్డి, సందీప్‌రెడ్డి, ఎస్సై రవీందర్, తాళ్ల సురేష్ రెడ్డి, కమిషనర్ ఏ అశోక్ రెడ్డి, మచ్చ శ్రీను, శ్రీధర్, ధనుంజయనాయుడు, సట్టు శ్రీను, చిలక రాజు శ్రీను, వార్డు అధికారి నాగరాజు మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సేవలోనూ ముందుంటాం

నవతెలంగాణ-సూర్యాపేట

తాము బట్టల వ్యాపారంలోనే కాకుండా సేవలోనూ ముందుంటామని ఎవరికైనా ఆపద వస్తే ఆదుకునేందుకు వెనుకాడమని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గండూరి శంకర్, పట్టణ అధ్యక్షులు గండూరి కృపాకర్‌లు పేర్కొన్నారు. బట్టల వ్యాపారి సంగిశెట్టి ఉమాకు బుధవారం స్థానిక క్లాత్ షోరూమ్ ఎదుట బట్టల వ్యాపారానికి రూ.37,500 ఆర్థిక సాయం అందజేసి మాట్లాడారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై కనకదుర్గ క్లాత్ స్టోర్స్ నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మెడకు గాయమై ఉమా కోమాలోకి వెళ్ళిందని కాగా ఇటీవల ఆమె తేరుకోవడం జరిగిందని తెలిపారు. బట్టల వ్యాపారులంతా కలసి రూ.37,500 సేకరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు శింగిరికొండ ప్రదీప్, అనంతుల రాజేశ్వర్, మొరిశెట్టి కోటేశ్వర్ రావు, ఎలగందుల సుదర్శన్, ఎలగందుల వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, మధుసూదన్ రావు, మహేందర్, రామ్మూర్తి, రమేష్, కరుణాకర్, సంధ్యారాణి, అరుణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ అభ్యర్థి నరోత్తమరెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

తాను ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలిచి నట్లయితే రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదు ర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీపీయుఎస్ బలపరిచిన ఉపాధ్యాయ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరోత్తమరెడ్డి అన్నారు. బుధవారం ఆయన పట్టణంలో టీపీయుఎస్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లవేళలా కృషి చేస్తానని, ఉపాధ్యాయులు ఆలోచించి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెంటయ్య పాపిరెడ్డి, రాములు, భాస్కర్, సంఘం నాయకులు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-చండూర్

లయన్స్ క్లబ్ చండూర్ సేవా వారి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల యొక్క శారీరక మానసిక దృఢత్వం కొరకు క్రీడా సామగ్రిని పీఎంజేఫ్ లయన్ మదన్ మోహన్‌రేపాల బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా పీఎంజేఫ్ లయన్ మదన్ మోహన్ రేపాల చేత యువత సాధికారత అంశంపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ లయన్ సంగుజానయ్య, కార్యదర్శి లయన్ లతీఫ్‌పాషా, కోశాధికారి లయన్ వెంకట్‌రెడ్డి, లయన్ లవకుమార్, లయన్ నెల్లూరి శ్రీనివాస్, లయన్ పాపిరెడ్డి, లయన్ ప్రదీప్‌కుమార్, లయన్‌పిచ్చయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎడ్లభిక్షం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వేముల వీరేశం



నవతెలంగాణ-కేతపల్లి

పేద ప్రజల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యం అని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. బుధవారం ప్రజాపాలనలో భాగంగా కేతేపల్లి మండలం కొర్లపాహడ్ గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హత కలిగిన వారి జాబితాను ఆమోదించేందుకు నిర్వహించిన గ్రామసభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ గడిచిన పదేండ్లలో గత ప్రభుత్వం ఒక్క ఇండ్లు కూడా ఇవ్వలేదన్నారు..ఇప్పటికే తమ ప్రభుత్వం నకిరేకల్ నియోజకవర్గంకి 3500 ఇండ్లను మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మెన్ గుత్తా మంజుల మండల వ్యవసాయ అధికారి బి. పురుషోత్తం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్,కాంగ్రెస్ నాయకులు గుత్తా మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ ఎడ్ల పార్వతమ్మ, మాజీ ఎంపీటీసీ ఎడ్ల సంధ్య పాల్గొన్నారు.

5,8 తరగతులకు నో డిటెన్షన్ విధానం రద్దు

- ప్రశ్నార్థకంగా మారనున్న విద్యా హక్కు చట్టం
- బాలికా విద్య పై నో డిటెన్షన్ ప్రభావం

నవతెలంగాణ-నకిరేకల్

విద్యాహక్కు చట్టం వచ్చాక కేంద్రం 2009 నుంచి విద్యార్థులకు డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసింది. పరీక్షల్లో పాసైన.. కాకున్నా పై తరగతులకు పంపిస్తున్నారు.అంటే ఏదైనా తరగతి పరీక్షల్లో తప్పిన విద్యార్థిని మళ్లీ అదే తరగతి గదిలో ఉంచే విధానం రద్దయిందన్నమాట. పరీక్ష తప్పినందుకు విద్యార్థులు పూర్తిగా చదువు మానేసే పరిస్థితిని నివారించడంతో పాటు వారు కనీసం ప్రాథమిక విద్యను పూర్తి చేసేలా చూడటానికే నోడిటెన్షన్ విధానం తీసుకొచ్చారు. దీనికి తూట్లు పొడుస్తూ ఇటీవల పాఠశాల విద్యకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం బోర్డు పరీక్షలు నిర్వహించి అందులో ఉత్తీర్ణులు అయితేనే పై తరగతికి పంపిస్తారు. అంటే నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసి దాని స్థానే డిటెన్షన్ విధానాన్ని తీసుకురావాలని కీలక నిర్ణయం తీసుకుంది. పాఠశాల విద్యలో ఐదు, ఎనిమిది తరగతుల విద్యార్థులు వారి వార్షిక పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలి. ఒకవేళ విద్యార్థులు ఉత్తీర్ణులు కాకపోతే వారికి రెండు నెలల్లో మరోసారి పరీక్షలు నిర్వహించాలి. రీ-ఎగ్జామ్‌లో కూడా విద్యార్థులు ఫెయిల్ అయితే సదరు విద్యార్థులు మళ్లీ ఆయా తరగతుల్లోనే చదవాల్సి ఉంటుంది.



పాఠశాల విద్య రాష్ట్ర జాబితాలోని అంశం కావున ఈ నిర్ణయం అమలు రాష్ట్ర స్థాయిలో జరుగుతుందని, కానీ కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ, సైనిక పాఠశాలలకు విధిగా ఈ నిర్ణయం వర్తిస్తుందని స్పష్టం చేసింది.

బాలికా విద్య పై నో డిటెన్షన్ ప్రభావం

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు 5,8 తరగతుల్లో డిటెన్షన్ విధానం అమలు జరిగితే ప్రభుత్వ విద్యా సంస్థల్లో డ్రాపౌట్స్ పెరుగుతారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో బడుగు, బలహీనవర్గాలకు చెందిన బాలికలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. గ్రామీణ గిరిజన ప్రాంతాలలో బాలిక విద్య పట్ల సరైన అవగాహన లేక చిన్న పిల్లలను తమ కుటుంబ ఆర్థిక పరిస్థితులకు చేదోడు వాదోడుగా వారిని పనుల్లో తీసుకెళ్లడం జరుగుతుంది.

విద్యాహక్కు చట్టం ప్రకారం 6 నుండి 14 సంవత్సరాల వయసు వరకు బాలలకు ఉచిత నిర్బంధ విద్యను అందించాల్సి ఉంటుంది. 8వ తరగతి వరకు ఏ ఒక్క విద్యార్థినీ ఫెయిల్ లేదా నిలుపుదల చేయకూడదు. కానీ కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం (%చీజు%-2020) అమలు పేరుతో విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ నో డిటెన్షన్ విధానాన్ని రద్దు చేసి డిటెన్షన్ పద్ధతిని తీసుకువచ్చింది. 2018 లోనే కేంద్ర ప్రభుత్వం డిటెన్షన్ పద్ధతి ప్రతిపాదన తీసుకురాగా ఆనాడే ప్రగతిశీల ప్రజాస్వామిక వాదులు, విద్యావేత్తలు, మేధావులు వ్యతిరేకించారు.

విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం

టి.నర్సింహమూర్తి, టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షులు, నకిరేకల్.

డిటెన్షన్ విధానం విద్యారంగ తిరోగమన చర్యగా మారే అవకాశం ఉంది. బడుగు బలహీనర్గాలకు వర్గాలకు చెందిన విద్యార్థులు, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు పాఠశాల విద్యకు దూరం అయ్యే ప్రమాదం ఉంది. డ్రాప్ ఔట్స్ పెరగడం ద్వారా బాల కార్మికులు పెరిగే అవకాశం కూడా ఉంది. విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయం పెరిగి ఉత్తీర్ణులు కాకపోతే వారిలో న్యూనతాభావం ఏర్పడి పసితనంలోనే మానసిక క్షోభకు గురయ్యే అవకాశం ఉంది. నో డి టెన్షన్ విధానంలో ఉన్న లోపాలను సవరిస్తూ విద్యా ప్రమాణాలను పెంచాల్సి ఉండగా, కొన్ని లోపాలను ఎత్తి చూపుతూ నో డి టెన్షన్ విధానాన్ని రద్దు చేయడం బాధాకరం.

బడీడు పిల్లలందరూ బడిలోనే ఉండాలి

నవతెలంగాణ-దామరచర్ల

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు మండల విద్యాధికారి బాలాజీనాయక్ తెలిపారు.దామరచర్ల మండలం లోని నూనావత్ తండా వద్దగల ఇటుక బట్టి నందు పనిచేసే కూలీల ఆరుగురు పిల్లలను ఆయన గుర్తించారు. వారిని తక్షణమే సమీప ప్రాదమిక పాఠశాల నందు నమోదు చేయించారు. ఇటుక బట్టి యజమాని సుదీర్ నాయక్ సహకారంతో పిల్లలకు నోటు పుస్తకాలు, పెన్నులు, బ్యాగు, బట్టలు అందించుటకు ఒప్పించారు.. ఆయన వెంట స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పరిపూర్ణాచారి, సి ఆర్ పి పాండు లు ఉన్నారు.

మెడికల్ అసిస్టెంట్ రిక్రూట్మెంట్‌కు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

భారతీయ వాయు సేన వారు అగ్నిపత్ స్కీమ్ నందు అగ్ని వీర్ వాయు నందు మెడికల్ అసిస్టెంట్ రిక్రూట్మెంట్‌కోసం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్. పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.. ఆసక్తి గల ఇంటర్మీడియట్, డిప్లొమా, బీఎస్సీ (ఫార్మసీ)ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆన్లైన్ ద్వారా https://agnipathvayu.cdac.in 27 జనవరి వరకు అప్లై చేసుకోవాలని దీనికి సంబంధించిన మరిన్ని వివరాలకు ఈనెల 24 న స్థానికఎన్. జి కళాశాల, నల్గొండ ఆవరణలో జరగనున్న అవేర్నెస్ ప్రోగ్రామ్‌కి హాజరు కావాలని పేర్కొన్నారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-చండూర్

సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలు ఈనెల 25 నుండి 28 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్నాయని ఈ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ అన్నారు.బుధవారం మండలకేంద్రంలో ఆ పార్టీ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు చిట్టిమల్ల లింగయ్య, నాయకులు ఈరటి వెంకటయ్య, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణయ్య, సైదులు, లింగస్వామి, వెంకన్న పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

నవతెలంగాణ-చండూర్

ముఖ్యమంత్రి సహయనిధి నుండి 8 మంది లబ్దిదారులకు కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత చంద్రశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్‌చైర్మెన్ దోటి సుజాతవెంకటేష్‌యాదవ్,కోడి శ్రీనివాసులు చేతులమీదుగా శ్రీనివాసులు రూ.60,000, వెంకన్న రూ.42000, యాదయ్య రూ. 46,500 వచ్చిన చెక్కులను లబ్దిదారులకు బుధవారం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదన్నారు.ఈ కార్యక్రమంలోమాజీ సర్పంచ్ మల్లేశం, రామ్మూర్తి, మల్లారెడ్డి, పాల్గొన్నారు.

రసాభాసగా చింతలపాలెం గ్రామసభలు



నవతెలంగాణ-చింతలపాలెం

రసాభాసగా పోలీసుల అదుపులో చింతలపాలెం గ్రామసభలు ప్రత్యేక అధికారులు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభలకు ప్రత్యేక అధికారులను నియమించి గ్రామప్రజల నుండి అర్జీలను స్వీకరించవలసిందిగా ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు రావటంతో గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే గత రెండు రోజుల క్రితం ప్రభుత్వం ప్రకటించిన లబ్ధిదారులను ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇల్లు -267, ఆత్మీయ భరోసా -91, రేషన్ కార్డు - 467 లిస్ట్ ను చింతలపాలెం గ్రామంలో ప్రత్యేక అధికారి తహశీల్దార్ సురేందర్ రెడ్డి అధ్యక్షతన గ్రామ కార్యదర్శి నాగుల్ మీరా ప్రకటిస్తుండగా అర్హుల జాబితాలో లేని నిరుపేదలు ఆర్థికంగా అన్ని ఉన్నవారికి ఈ పథకాలు వస్తున్నవి, ప్రభుత్వం నిరుపేదలను గుర్తించకపోవడం దుర్మార్గమని అధికారుల ముందు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రత్యేక అధికారి సురేందర్ రెడ్డి చొరవ తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. గత అర్హత జాబితాపై కొంతమంది అభ్యంతరం తెలియచేయగా వాటిని విచారణ చేసి జిల్లా కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్తానని చెప్పడంతో చింతలపాలెం గ్రామ ప్రజలు సంక్షేమ పథకాలకు ధరఖాస్తు చేసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే కంచర్లపై దాడిఘటనను మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

- మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగత్

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ఫ్లెక్సీలు తొలగించిన మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించడానికి వెళ్లిన తమ మాజీ శాసనసభ్యులు కంచర్లపై కాంగ్రెస్ గుండాల దాడి అమానుషమని, దివ్యాంగుడని కూడా చూడకుండా, పోలీసుల సమక్షంలోనే దాడి చేశారని ,ఇప్పటికే తాము ఎస్పీకి, డీజీపీకి ఫిర్యాదు చేశామని, మానవ హక్కుల కమిషన్ కూడా తాము ఫిర్యాదు చేయనున్నామని మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, నోముల భగత్. పేర్కొన్నారు. బుధవారం నల్లగొండలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో కార్పొరేషన్ మాజీ చైర్మెన్ దూదిమెట్ల బాలరాజు యాదవ్ ,పల్లె రవికుమార్ ,రాజీవ్ సాగర్ తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 28వ తేదీన రైతు మహా ధర్నాకు హైకోర్టు అనుమతి ఇచ్చిందన్నారు. తాముగౌరవ కోర్టు వారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నా విజయవంతం చేయాలని కోరారు. కేటీఆర్ ను చూసి.. భయపడి రైతు ధర్నాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని.. ఇప్పుడు కోర్టు అనుమతితో రెట్టించిన ఉత్సాహంతో.. సభను విజయవంతం చేస్తామని.. తెలిపారు.పల్లె రవికుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుడు వాగ్దానాలకు ప్రజలు మోసపోయి నేడు అడుగడుగునా వారిని ప్రజలు ఎండ కడుతున్నారని.. ఇప్పటికైనా ప్రభుత్వం తను చేసిన వాగ్దానం నిలబెట్టుకునే విధంగా ప్రజలకు మేలు చేయాలని కోరారు.దూదిమెట్ల బాలరాజు యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం



ప్రజలను అడుగడుగునా మోసం చేసిందన్నారు.మా ప్రభుత్వం చేసిన అభివద్ధి పనులకు తమ పేర్లు పెట్టుకుని కాంగ్రెస్ మంత్రులు ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నారన్నారు. వారు చేసిన పని ఒక్కటంటే ఒక్కటి లేదని విమర్శించారు. రాజీవ్ సాగర్ మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ నాయకులకు భయపడి రైతు మహాధర్నాకు అనుమతి ఇవ్వలేదన్నారు. ఈసమావేశంలో. నల్గొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బొర్ర సుధాకర్, సీనియర్ నాయకులు బక్క పిచ్చయ్య కనగల్ సింగిల్ విండో చైర్మెన్ వంగాల సహదేవరెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు కొండూరు సత్యనారాయణ,జమాల్ ఖాద్రి, మాజీ ఎంపీపీ ఎస్కే కరీం పాషా, బొజ్జ వెంకన్న.. మాజీ జెడ్పీటీసీ తుమ్మల లింగస్వామి, పట్టణ పార్టీ అధ్యక్షులు భువనగిరి దేవేందర్.. నల్గొండ కనగల్ మండల పార్టీ అధ్యక్షులు.. దేప వెంకట్ రెడ్డి అయితగోని యాదయ్య , సిరిగిరి వెంకటరెడ్డి, బడుపుల శంకర్ మాజీ ఎంపీటీసీలు, పొగాకు గట్టయ్య, సుంకిరెడ్డి వెంకట్ రెడ్డి ఉట్కూరు సందీప్ రెడ్డి, మెండు మణిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయి



- కలెక్టర్ హనుమంతరావు

నవతెలంగాణ-బీబీనగర్

రాష్ట్రంలో పేద ప్రజల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. బుధవారం బీబీనగర్ మండలంలోని రాఘవాపురం గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామసభలో ఆయన లబ్దిదారులు ఇచ్చే దరఖాస్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, పథకాలు అమలు చేయనునందున ఆయా పథకాల కింద అర్హులుగా గుర్తించబడిన వారి ముసాయిదా జాబితాను గ్రామసభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. గ్రామసభల లో, లబ్దిదారుల జాబితాలో పేర్లు రానివారు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులను జారీ చేయడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుందని తెలిపారు. అర్హుల నిర్ధారణ కోసం సామాజిక, ఆర్థిక సర్వే మీసేవ ,దరఖాస్తులు గ్రామసభలు, ద్వారా అందిన దరఖాస్తులను స్వీకరించి సమగ్ర పరిశీలన జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సును విజయవంతం చేయండి

నవతెలంగాణ-చౌటుప్పల్

గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలని గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాంధారి ప్రభాకర్ కోరారు. బుధవారం పట్టణకేంద్రంలో చౌటుప్పల్ మండల సర్వసభ్య సమావేశం వెన్‌రెడ్డి సంధ్యరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25న స్థానిక గాంధీ పార్కులో గాంధీ సుస్థిర విజ్ఞాన సదస్సును ఏర్పాటుచేయనున్నట్టు తెలిపారు. మున్సిపల్, గాంధీగ్లోబల్ ఫ్యామిలీ గాంధీ గ్యాన్ ప్రతిష్ట చౌటుప్పల్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ఒక ఫీట్ ఎత్తు గల గాంధీజీ 500 విగ్రహాల ఏర్పాటు, వంద చరకల ప్రదర్శన, 500 మంది బాల గాంధీల వేషధారణ, గాంధీ ఫొటోగ్యాలరీ, విజ్ఞానానికి సంబంధించిన ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ పాలకవర్గానికి వీడ్కోలు సన్మాన మహోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు,



అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పట్టణ ప్రజలు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీబీ.కృష్ణారావు, ప్రధానకార్యదర్శి యానాల ప్రభాకర్‌రెడ్డి, మహిళా కన్వీనర్ యానాల రాధిక, మండలకార్యదర్శి డాక్టర్ ఉజ్జిని మంజుల, కోశాధికారి పోలోజు శ్రీలత, ఉపాధ్యక్షురాలు బొబ్బిళ్ల సంధ్యమురళి, తొర్పునూరి భవానీ, వనం మమత, ఝూన్సీ, బద్దం స్వప్న, సువర్ణలక్ష్మీ, మునుకుంట్ల పద్మావతి, లక్ష్మీ విజయ, కీర్తన, చందన, సంధ్య, నిఖిత పాల్గొన్నారు.

బిక్షం నాయక్ మృతి పార్టీకి తీరని లోటు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి



నవతెలంగాణ-మోతె

బానోత్ బిక్షంనాయక్ మృతి పార్టీకి తీరనిలోటని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిధిలోని బిక్యతండ గ్రామంలో బానోతు బిక్షంనాయక్ (90) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని నాగార్జున్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళు లర్పించి మాట్లాడారు. నాడు తెలంగాణ ప్రాంతంలో జరిగిన వీర తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన నిర్వహించిన పాత్ర మరువ లేనిది అన్నారు. ఆయన కుటుంబం మొదటి నుండి పార్టీకి అండ దండలు ఇస్తూ ఈ ప్రాంతంలో ఎర్రజెండాను నిలబెట్టటములో ముఖ్య భూమిక వహించారన్నారు. నేటి యువత ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతూ కొనసాగించాలని పేర్కొన్నారు. నివాళులు అర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపల్లి సైదులు, మండల కమిటీ సభ్యులు కిన్నెర పోతయ్య, బానోతు లచ్చిరాం, దోసపాటి శ్రీనివాస్, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షులు వెలుగు మధు, చేగువేరా గ్రామ కార్యదర్శి బానోతు వెంకన్న, భానోత్ శంకర్, బానోతు రమేష్ , భానోత్ సైదా, వెంకన్న బానోతు కిషన్, బానోతు రమేష్, బానోత్ చంద్రనాయక్, బిగోలియా పాల్గొన్నారు.

మున్సిపాల్టీకి టెండర్ల ద్వారా రూ.68.83లక్షల ఆదాయం

నవతెలంగాణ-సూర్యాపేట

దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి జాతర సందర్భంగా నిర్వహించిన టెండర్ల ద్వారా మున్సిపాలిటీకి రూ.68,83,650 ఆదాయం సమకూరిందని కమిషనర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగ్జిబిషన్, చిరు దుకాణాల కాళీస్థలం, మిఠాయి, స్వీట్స్, వరి పేలాలు, బొంగులు,చెరకు గడలు,జాతర చుట్టూ విద్యుత్ సరఫరాకు వచ్చిన టెండర్ బాక్సులను ఓపెన్ చేయడం జరిగిందని తెలిపారు. ఎగ్జి బిషన్ ఐటమ్స్‌కు 15 దరఖాస్తులు జారీ చేయగా 7 గురు టెండర్లు సమర్పించగా అత్యధిక రేటు రూ.35,50,000లకు ఎల్. గోపాల్ కృష్ణ టెండర్ దక్కించు కున్నారని పేర్కొన్నారు. చిరుదుకాణాలకు ఎంఏ.వాజిద్ మియా రూ.6,60,000లకు టెండర్ దక్కించు కున్నారని పేర్కొన్నారు. మిఠాయి స్వీట్లకు అంచనా రేటు రూ.3,30,000ల కంటే తక్కువ రేటు కోట్ చేసినందున రీకాల్ టెండర్ పిలవడం జరుగుతుందని పేర్కొన్నారు. వరీ పేలాలు బొంగులకు రూ.1,80,000లకు ఎండీ నశీరుద్దీన్ టెండర్ దక్కించు కున్నారని తెలిపారు. అదే విధంగా జాతర చుట్టూ విద్యుత్ సరఫరాకు మొండికత్తీ జానకి రాములు రూ.89,000లకు టెండర్‌ను దక్కించు కున్నారని పేర్కొన్నారు. 2022-23 జాతరలో మున్సిపాల్టీకి టెండర్ల మీద ఆదాయం రూ.56,43,754 రాగ ఈసారి రూ.68,83,650 మున్సిపాల్టీకి ఆదాయం సమకూరనుందని పేర్కొన్నారు.

ఆర్టిజన్స్‌ను తక్షణమే కన్వర్షన్ చేయాలి

- ఆర్టిజన్స్ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మెన్ యన్నమల్ల నరేందర్

నవతెలంగాణ-సూర్యాపేట



విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్స్‌ను తక్షణమే కన్వర్షన్ చేయాలని ఆర్టిజన్స్ రాష్ట్ర జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మెన్ యన్నమల్ల నరేందర్, జిల్లా జేఏసీ చైర్మెన్ మేడే మారయ్య డిమాండ్ చేశారు. టీవీ ఏసి జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు స్థానిక జమ్మిగడ్డ లోని విద్యుత్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ఆర్టిజన్స్ రిలే నిరాహార దీక్షలు బుధవారానికి మూడో రోజుకు చేరుకున్న సందర్భంగా వారు మాట్లాడారు. విద్యుత్ సంస్థలో గత 20 ఏండ్లుగా ఎవరికి ఆటంకం కలిగించకుండా విధులు నిర్వహిస్తున్నామని అర్హతను బట్టి కన్వర్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టిజన్‌లను జూనియర్ లైన్ మెన్‌లుగా ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టిజన్స్ జిల్లా కన్వీనర్ కొండ నకులుడు, కో కన్వీనర్ అక్కినపల్లి శ్రీశైలం, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం,యాకయ్య, జిల్లా వైస్ చైర్మన్ తిరపయ్య, జిల్లా ఫైనాన్స్ సెక్రటరీ దాసోజు రవీంద్ర చారి, డివిజన్ ప్రెసిడెంట్ సంకేపల్లి దయాకర్ రెడ్డి, మహిళా నాయకులు నిమ్మనగోటి నాగమణి, జి, దీప్తి, పి, లక్ష్మమ్మ జి, శివలీల, ఎండీ సఫియా, ఈశ్వరమ్మ, శ్రీవిద్య పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడమే లక్ష్యం

నవతెలంగాణ-మద్దిరాల

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందడమే ప్రభుత్వ లక్ష్యమని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మెన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో ప్రజా పాలనలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో పాల్గొని మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హత కలిగిన వారి జాబితా ఆమెదించుకొనుట కోసమని నాలుగు పథకాలో పేర్లు లేని వారు మళ్ళీ దరఖాస్తు చేసుకోవచ్చు అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి కార్యదర్శి మహేష్ అధికారులు వహీద్, మనోహర్, ఉపేందర్, పిచ్చయ్యమార్కెట్ కమిటీ డైరెక్టర్ అమృతమల్లు,కాంగ్రెస్ నాయకులు ఏలేటి శ్యామ్ రెడ్డి, లింగరాజు,రేసు లింగయ్య, మల్లారెడ్డి, మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

భారీగా ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు

నవతెలంగాణ-మునగాల

మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం అధికారులు ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిమ్మ ఇళ్ల కోసం ఆరు గ్రామాల నుంచి 370మంది దరఖాస్తు చేసుకోగా ఆత్మీయ భరోసాకు 282మంది. రేషన్ కార్డులకు 201మంది.రైతు బంధు కోసం 26మంది దరఖాస్తు లు ఇచ్చినట్లు తాహసీల్దారు వలి గొండ ఆంజనేయులు తెలిపారు. ఆయా గ్రామాల నుంచి మొత్తం 879 దర ఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దారు చెప్పారు.

కాంగ్రెస్‌లో సముచిత స్థానం కల్పించాలి

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

మండలంలోని డాకుతండా కార్యకర్తలు తమకు కాంగ్రెస్‌లో సముచిత స్థానం కల్పించాలని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిని కోరారు. ఆ తండాలో ఉధవారం నిర్వహించిన సమావేశంలో కార్యకర్తలు మాట్లాడారు. ఏండ్ల తరబడి పార్టీ కోసం పనిచేస్తే మాకు అన్యాయమే జరుగుతుందన్నారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి అవకాశం కల్పిస్తూ సీనియర్లైన కార్యకర్తలను దూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మా తండాల్లో గ్రామంలో ఉన్న కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు.లేనిపక్షంలో పార్టీకే నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ గ్రామ శాఖ నాయకులు కృష్ణ,బాబీ,లక్ష్మి,బాలాజీ,భిక్షపతి,చందర్,హాతిరాం,కొర్ర శ్రీను,బాల్కోటి,జీవన్,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు.. ప్రజా వ్యతిరేక పాలన

- మున్సిపల్ వైస్ చైర్మెన్ పుట్ట కిషోర్

నవతెలంగాణ-సూర్యాపేట



కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదని ఇది ముమ్మాటికీ ప్రజావ్యతిరేకత ప్రజాపాలన అని మున్సిపల్ వైస్ చైర్మెన్ పుట్ట కిషోర్ అన్నారు. బుధవారం స్థానిక 22వ వార్డు రాజీవ్ నగర్‌లో గల మందుల వాడ కమిటీ హాల్‌లో నిర్వహించిన వార్డు సభ రసాబాసగా మారిన సందర్భంగా ఆయన మాట్లాడారు. అనర్హులకు సంక్షేమ పథకాలు ఎలా వస్తాయని అధికారులను ప్రజలు నిలదీసే పరిస్థితి సభలో నెలకొందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల పాపం అధికారులకు శాపంగా మారిందన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు దగా అని మండిపడ్డారు. రుణమాఫీ,పంట బోనస్ ఇవ్వడం, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక అంతా కూడా దగా అని ఆయన ఆరోపించారు. ఏడాది కాలంలో మీరు చేసిన దగాను ప్రజలు అర్థం చేసుకున్నారని పేర్కొన్నారు.ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామసభల్లో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

నవతెలంగాణ-వలిగొండరూరల్

పేదప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమపథకాలలో లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు జరుగుతున్నాయని గ్రామ సభలు నిర్వహిస్తున్న అధికారులను గ్రామాలలోని ప్రజలు నిలదీస్తున్నారు. బుధవారం వలిగొండ మండలంలోని గోపరాజుపల్లి, పులిగిళ్లలో, సంగెంలో, నాగారం గ్రామాలలో లబ్దిదారుల ఎంపికలో అనర్హులకు చోటు కల్పించి అర్హులను చేర్చక పోవడంపై గ్రామాలలో నిర్వహించే గ్రామసభలలో అధికారులను నిలదీసి ప్రశ్నించి అడ్డుకోవడంతో గందరగోళం ఏర్పడింది.అధికారులు ప్రజలకు నచ్చజెప్పి లబ్దిదారుల ఎంపిక నిరంతర ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.అర్హులైన వారు గ్రామసభలలో దరఖాస్తులు చేసుకోవాలని నచ్చజెప్పారు. వచ్చిన దరకాస్తులు సమీక్షించి అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిదంగా ప్రయత్నం చేస్తామని తెలిపారు. మండలంలోని మాందాపురం, టేకులసోమారం, ముద్దాపురం, లోతుకుంట, ఎం తుర్కపెల్లి, కేర్చుపల్లి, గురునాద్పల్లి గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకఅధికారి జగన్నాధం, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ అధికారి అంజనీదేవి, ఆర్‌ఐలు మనోహర్, కర్నాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

అండర్‌పాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతి

నవతెలంగాణ-భువనగిరి



భువనగిరి ప్రభుత్వం ఐటీఐ దగ్గర నేషనల్ హైవే రామకృష్ణాపురం పెంచికల్ పహాడ్‌తో పాటు ఇతర గ్రామాలకు వెళ్లడానికి అండర్‌పాస్ రోడ్ నిర్మాణం చేయాలని బుధవారం ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డికి అండర్‌పాస్ నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు, అండర్‌పాస్ నిర్మాణ సాధన కమిటీ కన్వీనర్ సిల్వర్ ఎల్లయ్య మాట్లాడారు.భువనగిరి ప్రభుత్వ ఐటీఐ దగ్గర రామకృష్ణాపురం పెంచికల్‌పహాడ్ నుండి వేములకొండ వరకు భువనగిరి వలిగొండ ఆత్మకూరు మోటకొండూరు నాలుగు మండలాలకు సంబంధించిన 40 గ్రామాల ప్రజలు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రమైన తరువాత ఇతర ప్రాంతాల నుండి విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపారాలు, వివిధ వృత్తులకు సంబంధించిన వారు రైతులు రోజువారి అవసరాల కోసం పలువురు నేషనల్ హైవేను దాటి ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారన్నారు.హైవే దాటడానికి సరైన రోడ్డు మార్గం లేక ప్రమాదాలకు గురై వందలాదిమంది ఇప్పటికే ప్రాణాలు పోగొట్టుకొని కాళ్ళ చేతులు విరిగి వికలాంగులుగా మారి ఆర్థికంగా చిక్కిపోయి ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డా పరిస్థితి ఉందన్నారు.ఈ ప్రాంతవాసులు బుగ్గకిష్టయ్య చీమలకొండూరు దయ్యాల బాలరాజు కేర్చిపల్లి జీ సత్తిరెడ్డి పోచంపల్లి వారు మృతి చెందారన్నారు.వీరితో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన మరో 14 మంది మృతి చెందారన్నారు.సుమారు 80 మంది అంగవైకల్యంతో వికలాంగులుగా మారారన్నారు. పలుమార్లు ప్రజలు వివిధ పార్టీలకు సంబంధించిన నాయకులు ఆందోళనలు ,పోరాటాలు, నిరసన దీక్షలు, ధర్నాలు చేపట్టి అధికారుల ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారన్నారు. నేటికి సమస్య పరిష్కారం గాక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా భువనగిరి ప్రభుత్వ ఐటీఐ దగ్గర నేషనల్ హైవే దాటి రామకృష్ణాపురం పెంచికల్‌పహాడ్‌తో పాటు నాలుగు మండలాలు ఇతర గ్రామాలకు వెళ్లడానికి అండర్‌పాస్ రోడ్డు నిర్మాణం తక్షణమే చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మందాడి సిద్ధారెడ్డి, కంచి మల్లయ్య భువనగిరి రాములు, సుబ్బూర్ పోశయ్య పాల్గొన్నారు.

మైనార్టీ గురుకుల డైరెక్టర్ లక్ష్మికి స్వాగతం

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ పట్టణంలోని మైనారిటీ ఆశ్రమ పాఠశాలలో బస చేసేందుకు రాష్ట్ర మైనారిటీ గురుకులాల డైరెక్టర్ కే. లక్ష్మీ బుధవారం సాయంత్రం చేరుకోగా స్థానిక సబ్ కలెక్టర్ ఏం. నారాయణ్ అమిత్, గురుకులాల జిల్లా కో ఆర్డినేటర్ పాండుగౌడ్, తహసీల్దార్ ఎన్.హరిబాబు, ప్రిన్సిపాల్ అరుణకుమారి స్వాగతం పలికారు. ఆమె పాఠశాల పని తీరు, వంటగది, స్టోర్ రూం, పరిసరాలను పరిశీలించారు, పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. విద్యార్థులతో ఇంటరాక్షన్ జరిపారు. మంచిగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. వారితో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల మధ్య నిద్ర చేశారు.

అనాథలకు, వికలాంగులకు సహకారం అందించాలి

నవతెలంగాణ-సూర్యాపేట

పుట్టినరోజు జరుపుకునే ప్రతి ఒక్కరూ అనాథలకు, వికలాంగులకు అనాథాశ్రమాల ద్వారా తమ వంతు సహకారం అందించాలని మేకప్ ఆర్టిస్ట్ లకుమారపు పద్మజ అన్నారు. బుధవారం తన కుమారుడు లకుమారపు సంతోష్ జన్మదిన సందర్భంగా స్థానిక ఆలేటి అనాథాశ్రమం, అపూర్వ దివ్యాంగుల పాఠశాలలో, అంగన్వాడి కేంద్రాలలో అనాథలకు బ్రెడ్ బిస్కెట్లు పంపిణీ చేసి మాట్లాడారు. అక్కడే ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొక్కల శేఖర్, ప్రధాన కార్యదర్శి శంకర్, సీనియర్ ఫోటోగ్రాఫర్ మదర్ బాయ్, స్టార్ స్టూడియో, వెలుగు శీను, నందిపాటీ సైదులు, ఆర్కే నాయుడు, పట్టణ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ నజీర్, వీరస్వామి రామాచారి, విశాల్ రమేష్, సమీర్, శేఖర్, శరత్ సక్సేన పాల్గొన్నారు.

ప్రగతిశీల ఉద్యమాలతో ఫాసిస్ట్ ప్రమాదాన్ని తిప్పి కొట్టాలి

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఉభయ రాష్ట్రాల్లో రెండు వర్గాలుగా కొనసాగుతున్న ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) సంస్థలు బుధవారం పట్టణంలో ఐక్యమయ్యాయి. ఈ మేరకు రైల్వే గేట్ సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయం నుండి వందలాది మంది యువకులతో ఎర్రని బిగిపిడికిలి జెండాలను చేతూని హోరెత్తిన నినాదాలతో బస్టాండ్ మీదుగా ఏఎస్.ఆర్ గార్డెన్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు.అనంతరం పీవైఎల్ బిగిపిడికిలి అరుణపతాకాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరు సాగర్ ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి ఎలగంటి రాజేందర్ అమరవీరులకు నివాళులు అర్పిస్తూ సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. ఐక్యతా సభకు రెండు సంఘాల రాష్ట్ర అధ్యక్షులు ఇందూరు సాగర్, మోకాళ్ల రమేష్ లు అధ్యక్షత వహించారు.టీ.పీ.టీ.ఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాస్ ప్రారంభిస్తూ మాట్లాడారు. దేశంలో మోడీ ప్రభుత్వం ఫాసిస్ట్ విధానాలను వేగవంతంగా అమలు చేస్తున్నాడని, ప్రగతిశీల ఐక్య ఉద్యమాల ద్వారానే యువత తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో, దేశంలో విద్యా,వైద్యం, ఉపాధి పేదలకు అందనంత దూరంలో ఉన్నాయని ఉన్నాయని, నిరుద్యోగం, పేదరికం, దారిద్ర్యంతో దేశం అంధకారంలోకి నెట్టబడుతుందని అన్నారు. ప్రగతిశీల యువకులే పోరాటాల ద్వారా వ్యవస్థను మార్చాలని పిలుపునిచ్చారు.ఆలేరు మంతపురి చౌరస్తా నుంచి మొదలైన యువజన మహా ప్రదర్శన రైల్వే గేట్, రైల్వే స్టేషన్,బస్టాండ్ మీదుగా పెద్ద వాగు మీటింగ్‌హాల్ ఏఎస్ఆర్ గార్డెన్స్ వరకు చేరుకుంది.ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఆవునూరిమధు, కె.గోవర్ధన్, పీవైఎల్ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు ఐలయ్య, సీపీఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు బేజాడి కుమార్, గొర్రెపాటి రమేష్, సహాయ కార్యదర్శి పర్షిక రవి,మారుజోడు సిద్దేశ్వర్, నోముల బాను చందర్,రాష్ట్ర కోశాధికారి డి.రవి,నాయకులు మోతిలాల్, నర్సింహారావ్,తిరుపతి, మనోహర్,స్థానిక జిల్లా,డివిజన్ నాయకులు ఇక్కిరి సహదేవ్,ఆర్.సీత, పద్మ సుదర్శన్,గడ్డం నాగరాజు, మామిడాల సోమయ్య, సాదుల శ్రీకాంత్, శికీలం వెంకటేష్, శికీలం కుమారస్వామి, పగడాల శివ,సమరసింహారెడ్డి, గుండుభిక్షపతి,మారుజోడు కుమార్,మామిడాల బాల మల్లేష్, యలగందుల సిద్దులు, కొమ్మిడి గోపాల్‌రెడ్డి,గోవింద్ పరమేశ్, తమ్మడి రమేష్, మామిడాల మధు, మామిడాల మహేష్, నల్ల నర్సింగరావు, రాచకొండ ఉదయ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

నవతెలంగాణ-తిరుమలగిరి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మున్సిపల్ చైర్మన్ శాగంటి అనసూయ రాములు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 8వవార్డులో ప్రజా పాలన-గ్రామ సభలు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డ్స్, ఇందిరమ్మ ఇల్లు పథకాల్లో భాగంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అర్హులై ఉండి కొత్త రేషన్ కార్డులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రాని వాళ్ళు గ్రామ సభలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంకి వెంకటమణి కరణ్ పాల్గొన్నారు.

20 రోజుల పనిదినాల నిబంధన సరికాదు

నవతెలంగాణ-మద్దిరాల

ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో 20 రోజుల పని నిబంధన సరైనది కాదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పోలోజు సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుదవారం మండలంలోని గోరంట్లలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో పాల్గొన్న తహశీల్దార్ అమీన్ సింగ్‌కు వినతి పత్రాన్ని అందించి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారుల కే ఇవ్వాలని కోరారు .ఆయన వెంట మాజీ ఎంపీటీసీ పాల్వాయి కవిత గ్రామ కార్యదర్శి కన్నె వీరయ్య గంగా సిరి వెంకన్న దీకొండ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-చండూరు

స్థానిక జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో బుధవారం టీపీయూఎస్ క్యాలెండర్ నుఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అలుగువెల్లి పాపిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ఈ సంఘం పోరాటం చేస్తూ ఉపాధ్యాయుల మన్నన పొందిందన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్ మాస్టర్ బిక్షం, మండల అధ్యక్షులు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు, మద్దోజు సుధీర్ బాబు, లయన్ జానయ్య, లయన్ లతీఫ్,రాపోలు యాదగిరి మరియు హైస్కూల్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు బిల్ కలెక్టర్‌లు సస్పెండ్

- కొనసాగుతున్న గ్రామసభలు వేలల్లో దరఖాస్తులు

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా స్కీమ్స్ అర్హులైన ప్రతి ఒక్కరికి పదకాలు అంది ంచాలన్న ఉద్దేశంతో కొత్తగా సంక్షేమ పథ కాలను ప్రవేశపెట్టిందని. నాలుగు పథకాలకు జరిగే గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటి ంచినప్పటికీ లబ్ధిదారులు పథకాల కోసం దరఖాస్తులు పెట్టుకుంటే దరఖాస్తులను చెత్తబుట్ట దాఖలు చేసిన ఘటన బుధవారం భువనగిరి ప ట్టణంలో చోటుచేసుకుంది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ మున్సిపల్ కమిషనర్ రామా నుజన్ రెడ్డి బిల్ కలెక్టర్లు రాములు, షఫీద్దీన్ లను సస్పెండ్ చేశారు. బుధవారం పట్టణంలో జరిగిన గ్రామసభల్లో లబ్ధిదారులు పథకాల కోసం దరఖాస్తు పెట్టుకుంటే రెండు బిండ ల్ గా ఏర్పాటు చేసుకొని ఒక బిండ ల్ ను గ్రామ సభ జరిగిన చోటే వదిలేశారు. ఇది చూసిన కొంతమంది ఫోటోలు తీసి వాట్సఅప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో అది కాస్త సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిని తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

నల్లగొండ జిల్లా లో268 గ్రామసభలు.. దరఖాస్తులు ఇలా..

ప్రజాపాలన గ్రామసభల నిర్వహణ లో భాగంగా బుధవారం నల్గొండ జిల్లాలో 221 గ్రామ సభలు, 47 మున్సిపల్ వార్డు సభలు మొత్తం 268 గ్రామ ,వార్డు సభలు నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఇప్పటివరకు గడచిన రెండు రోజులు కలుపుకొని 444 గ్రామసభలు, 95 మున్సిపల్ వార్డుల సభలను నిర్వహించినట్లు ఆమె వెల్లడించారు. బుధవారం రేషన్ కార్డుల కోసం 13921 కొత్త దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల కోసం 12,227, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 346, రైతు భరోసా కింద 288 దరఖాస్తులను స్వీకరించినట్లు ఆమె వివరించారు.

సూర్యాపేట జిల్లాలో దరఖాస్తులు ఇలా..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా స్కీమ్స్ అర్హులైన ప్రతి ఒక్కరికి పదకాలు అందించాలన్న ఉద్దేశంతో కొత్తగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని. నాలుగు పథకాలకు జరిగే గ్రామసభలలో దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. దీనిలో భాగంగా సూర్యాపేట జిల్లాలో బుధవారం గ్రామ, వార్డ్ సభలు నిర్వహించగ మొత్తం 475 గ్రామ పంచాయితీలు ఉండగా 139 గ్రామ సభలు, 05 మున్సిపాలిటీ పరిదిలోని 141 వార్డులలో 35 వార్డ్ సభలను అధికారులు నిర్వహించారు. గ్రామ సభలలో 616 మంది రైతు భరోసా కొరకు, 5537 మంది ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కొరకు, 4384 మంది కొత్త రేషన్ కార్డుల కొరకు, 6124 మంది ఇందిరమ్మ ఇండ్ల కొరకు ధరఖాస్తూ చేసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన వార్డ్ సభలలో 14 మంది మంది రైతు భరోసా కొరకు, 03 గురు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కొరకు, 972మంది కొత్త రేషన్ కార్డుల కొరకు, 1042మంది ఇందిరమ్మ ఇండ్ల కొరకు ధరఖాస్తూ చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 630 మంది రైతు భరోసా కొరకు, 5540 మంది ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కొరకు, 5356 మంది కొత్త రేషన్ కార్డుల కొరకు, 7166 మంది ఇందిరమ్మ ఇండ్ల కొరకు ధరఖాస్తూ చేసుకున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు.

మత్తు పదార్థాలు మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

బుధవారం ఎల్లారెడ్డిగూడెం జడ్.పి.హెచ్.ఎస్ ఉన్నత పాఠశాల, మహాత్మ జ్యోతిబాపూలే బాలుర కళాశాలనార్కట్పల్లి లో హైదరాబాద్ నార్కోటిక్ డ్రగ్స్ డిపార్ట్మెంట్ డి.ఎస్.పి బిక్షపతి రావు ఆధ్వర్యంలో విద్యార్థులకు మత్తు పదార్థాలు, డ్రగ్స్ వినియోగంపై జరిగే నష్టాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, దేశ భవిష్యత్తు నేటి నేటి యువతపైనే ఆధారపడి ఉందని, ప్రతి విద్యార్థి మత్తు పదార్థాలు, డ్రగ్స్ పై పూర్తి అవగాహనతో వాటి వల్ల జరిగే నష్టాలను గుర్తించి, వాటి దూరంగా ఉండి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఈ సందర్భంగా ప్రతి విద్యార్థితో జీవితంలో మత్తు పదార్థాలు, డ్రగ్స్ జోలికి పో మని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నార్కోటిక్ ట్రక్స్ డిపార్ట్మెంట్ ఇన్స్పెక్టర్ సౌమ నాయక్, జ్యోతిబాపూలే కళాశాల ప్రిన్సిపల్ మదనాచారి, ఎల్లారెడ్డిగూడెం జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ హిమజ, 200 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకే సంక్షేమ పథకాలు

నవతెలంగాణ-మోత్కూర్

కాంగ్రెస్ ప్రభుత్వం హడావిడిగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలనే లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని బీజేపీ మోత్కూర్ మండల మాజీ అధ్యక్షుడు దీటి సందీప్ ఆరోపించారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు అన్ని రకాలుగా ఉన్నోళ్లనే ఎంపిక చేయడంతో తమలాంటి పేదవారిని ఎందుకు ఎంపిక చేయడం లేదని, నాయకులకు అధికారులకు తాము కనిపించడం లేదా అంటూ గ్రామసభల్లో ప్రజలు నిలదీస్తున్నారని, ప్రజలకు సమాధానం చెప్పలేక అధికార పార్టీ నాయకులు ముఖం చాటేస్తున్నారని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.

నేరేడుచర్లలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-నేరేడుచర్ల

నేరేడుచర్ల మున్సిపల్ కేంద్రంలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్, సామాజిక కార్యకర్త సుంకర క్రాంతి కుమార్ కోరారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సూర్యాపేట కేంద్రంగా ఉన్న ఆర్టీవో కార్యాలయం నేరేడుచర్ల మండలంతో పాటు పాలకీడు గరిడేపల్లి చుట్టుపక్క మండలాలకు సుదూర ప్రాంతంలో ఉండి వాహనదారులకు, ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా ఉన్నందున నేరేడుచర్ల మున్సిపల్ కేంద్రంగా ఆర్టీవో కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తే వేలాదిమంది ప్రజలకు అనుకూలంగా ఉంటుందని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నేరేడుచర్లలో ఆర్టీవో కార్యాలయం ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సాగు పంటలను పరిశీలించిన ఎన్ఎస్ఎస్ఓ అధికారులు

నవతెలంగాణ-మోత్కూర్

మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామంలో సాగు చేస్తున్న పంటలను బుధవారం హైదరాబాద్‌కు చెందిన ఎన్ఎస్ఎస్ఓ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్అసిస్టెంట్ డైరెక్టర్ ఆర్ జయరామ్, ఎన్ఎస్ఎస్ఓ.విఎల్ విజయ, సూపర్వైజర్ ఆర్.ప్రభాకర్, వ్యవసాయ శాఖ భువనగిరి ఏడిఎస్. నీలిమ, ముఖ్య ప్రణాళిక కార్యాలయం ఉపగణాంక అధికారి ఎస్.లక్ష్మణ్, పాటిమట్ల గ్రామంలో 20 సర్వే సబ్ డివిజన్లలో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వీటి వివరాలను ఫరీదాబాద్‌కు ఎన్ఎస్ఎస్ఓ కార్యాలయానికి పంపిస్తున్నట్లు తెలిపారు.వీరి వెంట మండల ప్రణాళిక గణాంక అధికారిజి. కృష్ణ, తదితరులు ఉన్నారు.

నామమాత్రంగా గ్రామసభలు

నవతెలంగాణ-వలిగొండ రూరల్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలనలో ఆరుగ్యారంటీలపై పెట్టుకున్న దరఖాస్తులను గ్రామసభలలో పరిశీలించి లబ్దిదారుల జాబితాను తయారు చేయకుండా పేరుకే నామమాత్రంగా గ్రామసభలు జరుపుతున్నారని సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కళ్ళెం సుదర్శన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పులిగిల్ల గ్రామంలో గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ అధికారులు గ్రామ సభలల్లో కనీసం లబ్ధిదారుల వివరాలను అడిగిన ఎవర్ని ఎంపిక చేయలేదన్నారు.ఇంకా పరిశీలన జరుగుతుందని, ఇది నిరంతర ప్రక్రియ అంటూ ఎలాంటి చర్చ జరగకుండానే రసాభాస మధ్య గ్రామసభ ముగించేవారన్నారు.సంక్షేమ పథకాలు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో లబ్ధిదారుల జాబితా తయారు అవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయని ఈ విధంగా జరిగితే ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు కోమ్మిడి లక్ష్మారెడ్డి,వాకిటి వెంకట్‌రెడ్డి, బుగ్గ చంద్రమౌళి, వేముల చంద్రయ్య, వేముల అమరేందర్, వడ్డేమాన్ వెంకటయ్య, మారబోయిన నరసింహ, కొమ్మిడి సత్తిరెడ్డి, వేములఆనంద్, ముత్తయ్య, వేముల నాగరాజు, వడ్డేమాన్ రవి పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లను ఆపాలి

నవతెలంగాణ-చివ్వెంల

దేశంలో బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కాగార్ పేరుతో చేస్తున్న బూటకపు ఎన్కౌంటర్‌లను వెంటనే ఆపేయాలని సీపీఐ(ఎంఎల్)రెడ్ స్టార్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి యం.సైదయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ పార్టీ నూతన సంవత్సర క్యాలండర్ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.రాంచందర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం రాక ముందు కమ్యూనిస్టు పార్టీ ఏజెండాతో పాటు ఈ రాష్ట్రం లో జనతా సర్కార్ లాంటి పరిపాలన కొనసాగిస్తం అని చెప్పి లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని తన పరిపాలన విధానాన్ని కొనసాగిస్తూ బూటకపు ఎన్కౌంటర్ లను ప్రోత్సహిస్తుందని ఆరోపించారు. తెలంగాణలో ప్రజా పాలన పేరుతో నేడు పెద ప్రజలకు ఒరిగింది ఏమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో లింగా, నరేందర్, ఉపేందర్ పాల్గొన్నారు.

ఘనంగా అనగాష్టమి వ్రతంలు

నవతెలంగాణ-మిర్యాలగూడ రూరల్

రైల్వే కాలనీ శ్రీ సాయి దత్త ఆశ్రమంలో బుధవారం అనగాష్టమి వ్రతంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున దత్తాత్రేయ అభిషేకంలో అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. పట్టణం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అనగాష్ట వ్రతంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ప్రతాప్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి మట్టయ్య, జానకిరాముడు, పద్మ, భాగ్యలక్ష్మి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

దివీస్ వారి సేవలు అభినందనీయం

నవతెలంగాణ-వలిగొండ రూరల్



దివీస్ ల్యాబరేటరీ వారు గ్రామాలలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయని జాలుకాల్వ పంచాయతీ కార్యదర్శి అపర్ణ అన్నారు. బుధవారం మండలంలోని జాలుకాల్వలో అంగన్వాడీ నూతన భవనం, గ్రామ సమీపంలోని పిలాయిపెల్లి కాల్వలో పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకును తొలగించడానికి రూ.25లక్షలు మంజూరు చేసి నూతన అంగన్‌వాడీ భవన నిర్మాణపనులను ప్రారంభించి మాట్లాడారు. దివీస్ ల్యాబరేటరీ వారు ఈ ప్రాంత గ్రామాలలోని ప్రజల శ్రేయస్సు కోసం, పాఠశాలల ప్రహరీనిర్మాణం, విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్స్,వాటర్ బాటిల్స్, షూ పంపిణీ చేపడుతుండడంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మద్దెల సందీప్‌కుమార్, నరేందర్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, దివీస్ ప్రతినిధులు సాయికృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఛాంబర్స్ రాష్ట్ర అధ్యక్షులు వెన్‌రెడ్డి రాజుకు ఘన సన్మానం

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

చౌటుప్పల్ మున్సిపల్ చైర్మెన్,తెలంగాణ మున్సిపల్ ఛాంబర్స్ రాష్ట్ర అధ్యక్షులు వెన్‌రెడ్డి రాజు, 6వ వార్డు కౌన్సిలర్ ఆలె నాగరాజులను బుధవారం పద్మవంశీ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు గోశిక రాజేందర్ ఆధ్వర్యంలో శాలువా,మెమొంటో లతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మెన్ వెన్‌రెడ్డి రాజు మాట్లాడుతూ పద్మవంశీ కాలనీని కోటి రూపాయల నిధులతో సీసీరోడ్డు నిర్మాణం చేయించానన్నారు. కాలనీలో కొంత మిగిలిపోయిన పనులను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో చౌటుప్పల్ మున్సిపాలిటీనీ మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ ఆలే నాగరాజు. చౌటుప్పల్ మాజీ ఎంపీపీ చిక్కనర్సింహ, కాంగ్రెస్‌నాయకులు కానుగుల వెంకటయ్య,ఆవుల యేసుయాదవ్, పద్మవంశీకాలనీ గౌరవాధ్యక్షులు బాల ఎల్లయ్య ,ఉపాధ్యక్షులు ఏలూరి భరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి లెంకలపల్లిస్వామి, కోశాధికారి యేషాల రామారావు, సహాయ కార్యదర్శులు భారత మధు, చిట్టెంపల్లి జగన్, కార్యవర్గ సభ్యులు గుండు రమేష్,టాక్‌రాజేష్,వనంపెంటయ్య,రుద్ర బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల ఒలింపియాడ్‌లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీవిద్య

నవతెలంగాణ-శాలిగౌరారం

మంగళవారం రోజున నల్లగొండ జిల్లాలో, జిల్లా స్థాయిలో ఇంగ్లీష్ ఒలింపియాడ్ పోటీలు నిర్వహించారు, జిల్లా నలుమూలల నుండి వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు,ఈ పోటీల్లో వల్లాల ఆదర్శ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి శ్రీవిద్య జిల్లా ప్రథమ బహుమతి పొందారు,ఈ సందర్భంగా ఆంగ్ల విభాగాధిపతి చిత్తలూరి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఆధునిక సమాజంలో ఆంగ్ల విద్య ఆవశ్యకత ఎంతో ఉందని,ఆ దిశగా మేము ప్రయత్నంచేస్తున్నామనడానికి ఇలాంటి ఫలితాలు నిరూపిస్తాయని పేర్కొన్నారు,ఈ సందర్భంగా శ్రీవిద్య ను పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మరియు ఇంగ్లీష్ ఉపాధ్యాయులు చిత్తలూరి సత్యనారాయణ, సంధ్యారాణి మరియు ఇతర ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలియజేశారు.

ఎంజీ యూనివర్సిటీ 1,3,5 సెమిస్టర్ల ఫలితాలు విడుదల

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ 1 ,3 ,5 సెమిస్టర్ల ఫలితాలను ఉపకులపతి ఆచార్య ఖాజాఅల్తాఫ్ హుస్సేన్ ఉధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత కళాశాలలదేనని సూచించారు. డిగ్రీ కళాశాలలో విద్యా సౌకర్యాలు మెరుగుపరిచి హాజరు నిబంధనను విధిగా పాటించాలని సూచించారు. డిగ్రీ మొదటి సెమిస్టర్‌లో 6300 మంది విద్యార్థులకు గాను 1338 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా, మూడవ సెమిస్టర్ లో 4509 మందికి గాను 1569 మంది, ఐదవ సెమిస్టర్‌లో 5378 మందికి గాను 2380 మంది ఉత్తీర్ణత సాధించినట్లు సీఓజీ డా ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ఫలితాల పూర్తి వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో పొందుపర్చనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య అలువాల రవి, అడిషనల్ కంట్రోలర్ డాక్టర్ లక్ష్మీప్రభ, డా సంధ్యారాణి, డా రామచంద్రగౌడ్, డాక్టర్ ప్రవళిక, కోఆర్డినేటర్ డాక్టర్ భిక్షమయ్య పాల్గొన్నారు.

27 న భువనగిరి జిల్లా కేంద్రానికి మందకృష్ణ రాక

నవతెలంగాణ-ఆలేరుటౌన్

నెల 27వ తేదీన జిల్లా కేంద్రంలో జరగనున్న ప్రదర్శనకు,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ హాజరుకానున్నట్లు , అలే రు మండల కేంద్రంలో మండల అధ్యక్షులు సంఘి నవీన్ కుమార్ తెలిపారు. ఆలేరు మండల కేంద్రంలో బుధవారం ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న హైదారాబాద్ లో జరుగు వేయి గొంతులు - లక్ష డప్పుల మహా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంఘీ మైసయ్య, తాటికాయల నరేందర్, మధు , గణేష్ , సత్తయ్య కుమార్, కరుణాకర్ , ఎర్ర సూర్యం తదితరులు పాల్గొన్నారు.

నేడు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

- హాజరుకానున్న మంత్రి తుమ్మల

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం గంజిలో ఉదయం 10 గంటలకు ఉంటుందని , కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హాజరుకానున్నట్లు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి తెలిపారు. అనంతరం మధ్యాహ్నం 12:00గం లకు వలిగొండ మార్కెట్ యార్డ్ లో వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మెన్ , డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు , నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, హాజరవుతారని తెలిపారు.

ప్రజాపాలన కాదు ముమ్మాటికీ ప్రజావ్యతిరేక పాలన

నవతెలంగాణ-చండూరు



ప్రజాపాలన కాదు ముమ్మాటికీ ప్రజావ్యతిరేక పాలన అని బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకులు పిన్నింటి నరేందర్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశములో ఆయన మాట్లాడుతూ రైతు భరోసా,ఇందిరమ్మ ఇండ్లు ,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,కొత్త రేషన్ కార్డులు అర్హుల జాబితా సిద్ధం చేయడంలో అధికారులు ఫెయిల్ అయ్యారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజాపాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామ సభల సాక్షిగా మీ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని అన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? అని నిలదీశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు ఏమైనది.ఎన్నికల ముందు హామీలిస్తం అధికారంలోకి వచ్చాక ఎగ్గొడుతం అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రాష్ట్రంలో పోలీసులు లేనిదే పాలన సాగేటట్టు లేదని మండిపడ్డారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టిన పోలీసులు ఉండాల్సిందేనా?అని ప్రశ్నించారు చివరికీ గ్రామా సభలు కూడా పోలీసుల మధ్యే జరగాల అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు నకిరేకంటి లింగస్వామి గౌడ్, బీజేవైఎం మాజీ మండల అధ్యక్షులు ఆస్కాని శ్రీను సాగర్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించాలి

నవతెలంగాణ-మిర్యాలగూడ



మున్సిపల్ పరిధిలోనీ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని పార్కులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించాలని కోరుతూ బుధవారం మధ్యాహ్నం విగ్రహ దిమ్మెకు మున్సిపల్ అధికారులు నోటీసు అంటించారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్థలంలో 2022లో పరిషత్ పాలకవర్గం, అధికారుల అనుమతి లేకుండా పార్కును నిర్మించి 23మార్చి 2023న అప్పటి రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి జీ.జగదీశ్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, మున్సిపల్ చైర్మెన్ తిరునగరు భార్గవ్ ప్రారంభించారు. పార్కుకు మాజీ సర్పంచ్, మార్కెట్ మాజీ చైర్మెన్ స్వాతంత్ర్య సమర యోధుడు తిరునగరు గంగాధర్ పేరు పెట్టారు. అయితే పార్కులో రెండు మూడు రోజుల క్రితం దిమ్మె నిర్మించి విగ్రహాన్ని ప్రతిష్టించారు. పార్కులో అనుమతి లేకుండా విగ్రహం ఏర్పాటు చేశారని ఫిర్యాదుతో విగ్రహాన్ని జీఓ నంబర్ 18 తేదీ 28-2-2013 ప్రకారం తొలగించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. దీంతో మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్, టీపీఓ వి. సోమయ్య, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకన్న, టిపిఎస్ అంజయ్యలు ముసుగులో ఉన్న విగ్రహాన్ని పరిశీలించారు. పరిశీలన చేస్తున్న విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మెన్ తిరునగరు భార్గవ్ కమిషనర్ కు ఫోన్ చేసి మున్సిపల్ పాలకవర్గం ఆమోదంతో ఏర్పాటు చేశామని తెలిపారని కమిషనర్ అన్నారు. పాలకవర్గం తీర్మానం చెల్లదని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉన్న ఆర్ అండ్ బి, మున్సిపల్, పంచాయతీ రాజ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కూడిన కమిటీ అనుమతి ఉండాలని, అది లేనందున అక్రమం అవుతుందని సమాధానమిచ్చినట్లు కమిషనర్ తెలిపారు. విగ్రహం పెట్టిన వారే తొలగించకుంటే తాము తొలగించక తప్పదని కమిషనర్ పేర్కొన్నారు.

రాయల్ అట్లాస్ పుస్తకాలతో విద్యార్థులకు ఉపయోగం

నవతెలంగాణ-రామన్నపేట

విద్యార్థులకు ఈ అట్లాసు పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని విపంచి ఫౌండేషన్ చైర్మెన్ అనుముల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటగిరి శేఖర్ అన్నారు. బుధవారం మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వెలకుర్తి పుల్లయ్య చారి-కనకమ్మ దంపతులు, వెలకుర్తి నారాయణచారి, వెలకుర్తి పరుషయ్యచారి, అనుముల అంతయ్యల జ్ఞాపకార్థం వారి కుమారులు వెలకూర్తి కుమారచారి, నర్సింహాచారి సువర్ణా చారి చంద్రశేఖర చారి, అనుముల శ్రీనివాస్ లు సంయుక్తంగా పదవ తరగతి చదివే విద్యార్థులకు రాయల్ అట్లాసు పుస్తకాలను అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణం కోసం దాతల సహకారం తీసుకోవాలని, అదేవిధంగా విపంచి ఫౌండేషన్ ఎల్లప్పుడు సహకారం అందిస్తుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శేఖర్; వెలకుర్తి కుటుంబ సభ్యులు కుమారచారి, నర్సింహాచారి, చంద్రశేఖరాచారి, ఉపాధ్యాయులు పుట్ట సైదులు, శ్రీనివాస్‌రెడ్డి, వేణు, అశోక్, ఆల్వాల్‌రెడ్డి నిర్మల, లింగాచారి, పెంటయ్య లక్ష్మి ప్రసన్న, గీత, మణి, ఫౌండేషన్ కొ అర్డినేటర్ బూరుగు గోపికృష్ణ, విశ్వబ్రాహ్మణ గ్రామశాఖ అధ్యక్షులు వెలకుర్తి నర్సింహాచారి, ప్రధాన కార్యదర్శి వెలకుర్తి జానాచారి తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- ఎమ్మెల్యే కు వినతి
- గొర్ల మేకల పెంపకం దారుల సంఘం జిల్లా అధ్యక్షులు దయ్యాల నరసింహ

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



భువనగిరి ప్రభుత్వం ఐటిఐ దగ్గర నేషనల్ హైవే రామకృష్ణాపురం పెంచికల్ పహాడ్ తో పాటు ఇతర గ్రామాలకు వెళ్లడానికి అండర్పాస్ రోడ్ నిర్మాణం చేయాలని ఈరోజు బుధవారం భువనగిరి శాసనసభ్యుడు అనిల్ కుమార్ రెడ్డి కి అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. గొర్రెల మేకల పెంపక దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిర్మాణ సాధన కమిటీ కన్వీనర్ సిల్వర్ ఎల్లయ్య మాట్లాడుతూభువనగిరి ప్రభుత్వ ఐటిఐ దగ్గర రామకృష్ణాపురం పెంచికల్ పహాడ్ నుండి వేములకొండ వరకు భువనగిరి, వలిగొండ, ఆత్మకూరు, మోటకొండూరు నాలుగు మండలాలకు సంబంధించిన 40 గ్రామాల ప్రజలు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రమైన తరువాత ఇతర ప్రాంతాల నుండి విద్య వైద్యం ఉపాధి వ్యాపారాలు వివిధ వృత్తులు కు సంబంధించిన వారు రైతులు రోజువారి అవసరాల కోసం పలువురు నేషనల్ హైవే ను దాటి ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు హైవే దాటడానికి సరైన రోడ్డు మార్గం లేక ప్రమాదాలకు గురై వందలాదిమంది ఇప్పటికే ప్రాణాలు పోగొట్టుకొని కాళ్లు చేతులు విరిగి వికలాంగులుగా మారి ఆర్థికంగా చిక్కిపోయి ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డా పరిస్థితి ఉన్నది ఈ ప్రాంత వాసులు బుగ్గ కిష్టయ్య చీమలకొండూరు దయ్యాల బాలరాజు కేర్చిపల్లి జీ సత్తిరెడ్డి పోచంపల్లి వారు మరణించడం జరిగింది. వీరితోపాటు వివిధ ప్రాంతాల వారు మరో 14 మంది మరణించారు. సుమారు 80 మంది అంగవైకల్యంతో వికలాంగులుగా మారినారు. పలుమార్లు ప్రజలు వివిధ పార్టీలకు సంబంధించిన నాయకులు ఆందోళనలు పోరాటాలు నిరసన దీక్షలు ధర్నాలు చేపట్టి అధికారుల ప్రభుత్వం దృష్టికి తీసుకురావడం జరిగింది నేటికి సమస్య పరిష్కారం గాక అనేక మంది ప్రాణాలు కోల్పోవుచున్నారు. ఈ సందర్భంగా భువనగిరి ప్రభుత్వ ఐటిఐ దగ్గర నేషనల్ హైవే దాటి రామకృష్ణాపురం పెంచికల్పహాడ్లతోపాటు నాలుగు మండలాలు ఇతర గ్రామాలకు వెళ్లడానికి అండర్పాస్ రోడ్డు నిర్మాణం తక్షణమే చేపట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మందాడి సిద్ధారెడ్డి, కంచి మల్లయ్య, భువనగిరి రాములు, సుబ్బూర్ పోశయ్యలు పాల్గొన్నారు.